ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనం వార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..




'జనం వార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహ, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889

మేడ్చల్ | ఆదివారం | 05.07.2026 | సంపుటి : 2 | సంచిక : 04 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్



## నేటి చికెన్ ధరలు


| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 251 (కిలో) |
| స్కిన్ లెస్ | 284 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹88

## పార్లమెంట్ వర్షాకాల షెడ్యూల్ ఖరారు

జులై20 నుంచి ఆగస్ట్ 13 వరకు సమావేశాలు

ఎక్స్ వేదికగా వెల్లడించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు



04



## కల్వకుంట్ల కవితకు ఎన్నికల సంఘం షాక్

### టీఆర్ఎస్ పార్టీ పేరు మార్చుకోవాలని నోటీస్

అలాంటి ప్రసక్తి లేదంటూ స్పష్టం చేసిన కవిత

అవసరమైతే సుప్రీంపు ఆశ్రయిస్తామని వెల్లడి

04

## ఇరాన్ సుప్రీం ఖమేనీ అంత్యక్రియలు

వేలాదిగా టెహ్రాన్ నగరానికి తరలివచ్చిన ప్రజలు

భారత బృందంలో బీహార్ గవర్నర్, కేంద్రమంత్రి హాజరు

అమెరికా దాడుల్లో మృతిచెందిన ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు శనివారం అధికారికంగా ప్రారంభమయ్యాయి. అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఈ ఏడాది ఫిబ్రవరి 28న మ-రణించిన 86 ఏళ్ల ఖమేనీకి చివరి వీడ్కోలు పలికేందుకు వేలాదిగా ప్రజలు టెహ్రాన్ నగరానికి తరలివచ్చారు.

-మిగతా 4 లో..





## యుద్ధం వేళ ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

### ఇంధనంపై ప్రజలను భయపెట్టే యత్నాలు జరిగాయి

అయితే సమర్థంగా సవాళ్లను అధిగమంచగలిగాం

రాజస్థాన్‌లో గ్రీన్ రిఫైనరీని ప్రారంభించిన ప్రధాని మోడీ

జయపుర, జులై 4 : పశ్చిమాసియా సంక్షోభం వేళ దేశంలో ఇంధన సంక్షోభాన్ని విజయవంతం ఎదుర్కొన్నట్లు ప్రధాని మోడీ అన్నారు. ప్రజలను భయపెట్టే ప్రయత్నాలు జరిగాయి. రాజకీయాలు చేశారు. కానీ వారి కుట్రలు ఫలించలేదు. కొన్ని చిన్న చిన్న ఇబ్బందులు తప్ప దేశంలో ఎక్కడా ఇంధన సరఫరా ఆగలేదని అన్నారు. శనివారం రాజస్థాన్‌లోని బాలోత్రా జిల్లా పచ్‌పద్రాలో దేశంలోని తొలి గ్రీన్‌ఫీల్డ్ సమగ్ర

-మిగతా 2 లో..

# మిడ్జిల్‌లో నాటిన మొక్క.. మహావృక్షమైంది

### పేదలకు సేవచేసే భాగ్యం దక్కడం అదృష్టం

### పాలమూరు నుంచి ఎందరో మహానుభావులు వచ్చారు

పాలమూరు బిడ్డలు పార పట్టగలరు.. పాలన చేయగలరు

మిడ్జిల్ నన్ను భుజానికెత్తుకుని ఆదరించింది

బిఆర్ఎస్ పాలకులు రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారు

మిడ్జిల్ రాజకీయ కృతజ్ఞతా సభలో సిఎం రేవంత్ రెడ్డి



మహబూబ్‌నగర్, జూలై 4 : ఆనాడు మిడ్జిల్ మండల ప్రజలు నాటిన మొక్క ఇవాళ మహా వృక్షమై, ప్రజలకు చేవ చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తొలిసారిగా 2006 జులై 4న మిడ్జిల్ ప్రజలు ఆశీర్వదించారని గుర్తు చేసుకున్నారు. 20 ఏళ్ల రాజకీయ జీవితం పూర్తయిన సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభలో సీఎం మాట్లాడారు. తన రాజకీయ ప్రయాణంలో కీలకమైన మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మిడ్జిల్, కల్వకుర్తి ప్రాంతాలకు గతంలోనూ గొప్ప గొప్ప నాయకులు ఉండేవారు. హైదరాబాద్ రాష్ట్రానికి తొలి సీఎంగా చేసిన బూర్గుల రామకృష్ణారావు మహబూబ్ నగర్ బిడ్డే. ఎంపీగా, కేంద్రమంత్రిగా దేశానికి సేవలందించిన జైపాల్‌రెడ్డి ఈ జిల్లా బిడ్డే. 2006లో జడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నన్ను ఇక్కడి ప్రజలు అక్కున

-మిగతా 2 లో..



## ఉల్లి రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త

### ఉల్లి కనీస మద్దతు ధర 13 శాతం మేర పెంపు

న్యూఢిల్లీ, జూలై 4 : ఉల్లి రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఉల్లి కనీస మద్దతు ధరను 13 శాతం మేర పెంచింది. తాజా పెంపుతో క్వింటాలు ఉల్లి ధర రూ. 1,875 నుంచి రూ. 2,125కు పెరిగింది. ఉల్లి సేకరణను పెంచేందుకు, రైతులకు లాభం చేకూర్చేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ పెంపు తక్షణం అమల్లోకి వస్తుందంటూ తాజాగా ప్రకటన విడుదల చేసింది. ఈ సీజన్‌లో కేంద్రం ఉల్లి ధరను పలుమార్లు పెంచింది. ఉల్లి బఫర్ స్టాక్ సేకరణ మందకొడిగా సాగుతున్న నేపథ్యంలో కేంద్రం ఉల్లి కనీస మద్దతు ధరను పలుమార్లు పెంచింది. జాతీయ మీడియా కథనాల

-మిగతా 2 లో..



## అభివృద్ధి కార్యక్రమాల్లో వేగం పెంచాలి

### క్యూర్ పరిధిలో అర్బన్ హౌసింగ్‌కు అత్యంత ప్రాధాన్యత

రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలకు ఆధునిక శాశ్వత భవనాలు

ప్రభుత్వ ప్రాధాన్యతల అమలులో సమన్వయంతో పనిచేయాలి

అధికార యంత్రాంగానికి మంత్రి పొంగులేటి దిశానిర్దేశం

> రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో వేగం పెంచాలని, ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలో అఫర్డ్‌బుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్ స్కీమ్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణంపై శనివారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు.

హైదరాబాద్, జూలై 4 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో వేగం పెంచాలని, ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలో అఫర్డ్ బుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్ స్కీమ్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణంపై శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో

-మిగతా 2 లో..

# భట్టి విక్రమార్క గోబెల్స్ ప్రచారం

### అప్పులపై తప్పుడు లెక్కలు

రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారవు

బిఆర్ఎస్ దిగిపోయేనాటికి 4.14 లక్షల కోట్ల అప్పు

మీడియా సమావేశంలో మండిపడ్డ హరీశ్ రావు



హైదరాబాద్, జూలై 4 : బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు రూ. 5.16 లక్షల కోట్లు అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పిన మాటలు అవాస్తవమని మాజీ మంత్రి, ఆ పార్టీ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ చేసిన రూ. 15 వేల కోట్ల అప్పును కూడా బీఆర్ఎస్ ఖాతాలో చూపారని విమర్శించారు. రంకెలు వేసినంత మాత్రాన అంకెలు మారిపోవంటూ ఘాటుగా స్పందించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయేనాటికి చెల్లించాల్సిన మొత్తం అప్పు రూ. 4.14 లక్షల కోట్లు మాత్రమే. కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి పథకాలను కేసీఆర్ అమలు చేశారు. నిధులు లేవని కేసీఆర్ ఏనాడూ సంక్షేమ పథకాలను ఆపలేదు. ఎన్నో చేస్తామని

-మిగతా 2 లో..



# పేరుపేరునా ఆత్మీయ పలకరింపు

### ఊర్కొండపేటలో సిఎం పర్యటన

### పాత మిత్రులతో సరదాగా గడిపిన రేవంత్

నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండపేటలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. అక్కడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 20 ఏళ్ల క్రితం మిడ్జిల్ జడ్పీటీసీగా రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం ప్రారంభమైన సంగతి తెలిసిందే. జడ్పీటీసీగా తన విజయానికి సహకరించిన వారిని సీఎం కలిశారు. అనుచరులు, జిల్లా నేతలతో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. తన రాజకీయ అనుచరులను ఆత్మీయంగా పలకరించారు. మిత్రులతో కలిసి ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డితో ఉన్న అనుబంధాన్ని పలువురు గుర్తు చేసుకున్నారు.

– నాగర్ కర్నూల్,జూలై4



# యుద్ధం వేళ ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం


(మొదటిపేజీ తరువాయి)

రిఫైనరీ–పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను మోడీ ప్రారంభించారు. సుమారు రూ.1.06 లక్షల కోట్ల విలువైన పెట్రోకెమికల్స్, రైల్వేలు, రహదారులు, మెట్రో, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ ప్రసార ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. దేశ ఇంధన భద్రత, పశ్చిమాసియా యుద్ధం సమయంలో భారత్ ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని అధిగమించిన విధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన మార్కెట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని ప్రధాని తెలిపారు. ఈ సమయంలో భారత్‌లో ఇంధన కొరత వస్తుందని కొందరు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ప్రతిపక్షాలను ఉద్దేశించి ఆరోపించారు. ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ చమురు మార్కెటింగ్ సంస్థలు రూ.75 వేల కోట్లకు పైగా నష్టాన్ని భరించాయని తెలిపారు. ప్రజలపై భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని కూడా తగ్గించిందని పేర్కొన్నారు. భారత్‌కు పెద్దగా చమురు నిల్వలు లేవని గుర్తుచేసిన ప్రధాని.. యుద్ధం సమయంలో ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి 120 డాలర్లకు పెరిగిందన్నారు. కొన్ని దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు 40–50 శాతం పెరగడమే కాకుండా రేషన్ విధానం కూడా అమలు చేశారని చెప్పారు. అయితే భారత్‌లో మాత్రం ఒక్కరోజు కూడా ఇంధన కొరత తలెత్తలేదని స్పష్టం చేశారు. సంక్షోభానికి ముందు భారత్ కేవలం 25–26 దేశాల నుంచే ఇంధనం దిగుమతి చేసుకునేదని.. కానీ యుద్ధం ప్రారంభమైన తర్వాత భారత దౌత్యపరమైన ప్రయత్నాల వల్ల 40కిపైగా దేశాల నుంచి చమురు, ఇంధనం దిగుమతి చేసుకున్నామని ప్రధాని వెల్లడించారు. దేశ ప్రయోజనాలు, ప్రజల సంక్షేవ–ఎమే భారత్‌కు అత్యంత ప్రాధాన్యం అనే సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చామని అన్నారు. భారత్‌కు అవసరమైన ఎల్పీజీలో దాదాపు 60 శాతం దిగుమతుల ద్వారానే వచ్చేదని.. అందులో 90 శాతం హార్ముజ్ జలసంధి మార్గంలో గల్ఫ్ దేశాల నుంచే వచ్చేదని తెలిపారు. యుద్ధం కారణంగా సరఫరా దాదాపు నిలిచిపోయిన సమయంలో రిఫైనరీల సామర్థ్యాన్ని వినియోగించి కేవలం ఏడు రోజుల్లోనే దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని 35 వేల మెట్రిక్ టన్నుల నుంచి 54 వేల మెట్రిక్ టన్నులకు పెంచామని చెప్పారు. ఇప్పటివరకు ఎల్పీజీ ఉత్పత్తి చేయని కొన్ని రి÷నైరీలను కూడా ఈ అవసరానికి అనుగుణంగా మార్చినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా పైప్ ద్వారా సహజ వాయువు కనెక్షన్లను వేగంగా విస్తరించామని, 11 లక్షలకుపైగా కుటుంబాలకు కొత్త పీఎన్‌జీ కనెక్షన్లు అందించామని ప్రధాని వెల్లడించారు. మార్కెట్ అంచనాల ప్రకారం గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.2,000 వరకు చేరే అవకాశం ఉన్నప్పటికీ.. ప్రస్తుతం రూ.950లోపే అందిస్తున్నామని పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం 21వ శతాబ్దంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభానికి కారణమైందన్నారు. సమస్యను ముందుగానే అంచనా వేసి సరైన నిర్ణయాలు తీసుకున్నాం. దేశ వనరులను సమర్థంగా వినియోగించాం. దౌత్య శక్తిని సానుకూలంగా ఉపయోగించాం. అందుకే భారత్ ఈ సంక్షోభాన్ని విజయవంతంగా అధిగమించిందని చెప్పారు. ఇర పచ్‌పద్రా రిఫైనరీతో భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ దేశంగా మరింత బలోపేతమవుతోందని ప్రధాని తెలిపారు. ఈ సమగ్ర రి÷నైరీకి ఏడాదికి 2.4 మిలియన్ మెట్రిక్ టన్నుల పెట్రోకెమికల్ ఉత్పత్తి సామర్థ్యం ఉందన్నారు. ఇది దేశ ఇంధన భద్రతను పెంచడంతో పాటు పెట్రోకెమికల్ రంగంలో స్వయం సమృద్ధికి దోహదపడుతుందని.. వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అదనంగా జైపూర్ మెట్రో రెండో దశ, రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, బికానేర్ సోలార్ పార్కులు, విద్యుత్ ప్రసార లైన్లు సహా పలు అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రధాని దేశానికి అంకితం చేశారు.

# భట్టి విక్రమార్క గోబెల్స్ ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

ఆనాడు కాంగ్రెస్ నేతలు బాండ్లు రాసిచ్చారు. కాంగ్రెస్ నేతల అనుభవం స్కామ్‌లు చేసేందుకే ఉపయోగపడుతోందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర అప్పులపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అసత్యాలు చెబుతున్నారని, హామీల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని హరీశ్ రావు అన్నారు. రాష్ట్రంలో లేని అప్పులను ఉన్నట్టుగా చూపిస్తూ కాంగ్రెస్ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం ఎదుర్కొంటున్న వైఫల్యాల నుంచి, తమపై జరుగుతున్న డ్యామేజ్ నుంచి తప్పించుకునేందుకే భట్టి విక్రమార్క ఇప్పుడు కొత్త డ్రామాలకు తెరలేపారని, అందులో భాగమే ఇలా మాట్లాడుతున్నారని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ప్రజలను ఆకట్టుకోవడానికి కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయలేక చేతులెత్తేస్తూ ఇలాంటి కుంటిసాకులను చెబుతున్నారు. ప్రజలను నమ్మించి ఓట్లు రాబట్టుకునేందుకే ఆనాడు గ్యారంటీ కార్డులు పంచారు. తీరా ఇప్పుడు వాటిని అమలు చేయాల్సి వచ్చేసరికి రోజుకో మాట, పూటకో సాకు చెబుతూ కాలయాపన చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు కోపంతో ఊగిపోయినంత మాత్రాన వాస్తవాలు మారిపోవు. ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ఈ విధమైన రాజకీయ ఎత్తుగడలు వేస్తోందని అన్నారు.



# ఉల్లి రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం, జూన్ 1 నాటికి కేవలం 2 వేల టన్నుల ఉల్లినే ప్రభుత్వం సేకరించగలిగింది. దీంతో, పలుమార్లు ధరలను పెంచింది. ఉల్లి ధర కేజీకి రూ.12.7 నుంచి రూ.15.80కు పెంచుతూ మే 22న ఆదేశాలు జారీ చేసింది. జూన్ 13న ధరను కేజీకి రూ.16.50కు పెంచింది. జూన్ 20న కిలో ఉల్లిపాయల ధరను రూ.18.75కు పెంచింది. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం, 2025–26లో ఉల్లిపాయల ఉత్పత్తి 307.33 లక్షల టన్నులకు చేరుకుంటుందది. 2024–25 మధ్య కాలంలో 307.67 లక్షల టన్నుల ఉల్లిపాయల సేకరణ జరిగింది.

# మిడ్జిల్‌లో నాటిన మొక్క.. మహావృక్షమైంది

(మొదటిపేజీ తరువాయి)

చేర్చుకున్నారు. నాది ఈ నియోజకవర్గం కాకపోయినా.. నమ్మకంతో గెలిపించారు. మీరు నాపై పెట్టిన నమ్మకమే.. ఇవాళ నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చిందని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు మండలాలు 2006లో డార్క్ మండలాలుగా ఉండేవి. నా రాజకీయ జీవితంలో కీలకమైన మిడ్జిల్ మండలానికి ఏదైనా చేయాల్సిన బాధ్యత నాపై ఉంది. ఈ మండలాన్ని దత్తత తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరుతున్నానని ప్రకటించారు. నేను ఏనాడూ పదవి, అధికారాన్ని దుర్వినియోగం చేయలేదు. వందేళ్లుగా కులగణన జరగలేదు. రాష్ట్రంలో కులగణన చేపట్టి దేశానికే దిక్సూచిగా నిలిచాం. దొర దురహంకారాన్ని మరోసారి బొందపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ కోసం పోరాడిన గద్దర్ అన్నను దొర గడీ ముందు గంటల కొద్దీ నిలబెట్టారు. రాష్ట్రంలో పదేళ్లపాటు పేదలకు సొంతింటి కల నెరవేరలేదు. ఈ ప్రభుత్వం గ్రామగ్రామాన ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదల కలను సాకారం చేస్తోంది. రూ.70వేల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని రూ.8.50 లక్షల కోట్ల అప్పుల స్థాయికి దిగజార్చారు. కేసీఆర్ ఏ గ్రామంలోనైనా డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారా? మూడెకరాల భూమి ఇచ్చారా? కోటి ఎకరాలకు నీరు ఇచ్చారా? ఇంటికో ఉద్యోగం ఇచ్చారా? అంటూ ప్రజలను ప్రశ్నించారు. ఇసుక దోపిడీకి అడ్డువచ్చిన నేరెళ్ల దళితులను లారీలతో తొక్కించారు. పదేళ్లు తన కుటుంబానికి, బంధువులకు తప్ప.. ఎవరికైనా ఉద్యోగాలు, పదవులు వచ్చాయా అని అన్నారు. కేసీఆర్ కుటుంబం



దోపిడీలు, దొంగతనాలు మళ్లీ మొదలు కావడానికి ప్రజాపాలన పోవాలా? కేసీఆర్‌కు గజ్వేల్‌లో వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఎలా వచ్చిందన్నారు. కేటీఆర్, కవిత, హరీశ్‌రావుకు రూ.వేల కోట్ల విలువైన భూములు, ఫామ్‌హౌస్‌లు ఎక్కడి నుంచి వచ్చాయని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మిడ్జిల్ డార్క్ మండల కాదు.. వెలుగు రేఖ అని నిరూపించాలన్నారు. 2006లో జెడ్పీటీసీగా తనపై పోటీ చేసిన రబ్బానీకి ప్రభుత్వ పదవి ఇస్తామని చెప్పారు. పేదల మధ్య పెరిగిన తనకు పేదల కష్టాలు, సమస్యలు తెలుసని అన్నారు. కానీ దొరలకు గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన ఉండదన్నారు. అన్ని గ్రామాల్లో సమస్యలు పరిష్కారమైతే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, ఎంపి మల్లు రవి, జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం ఏర్పరుచుకుంటా

## 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానంపై రేవంత్‌రెడ్డి భావోద్వేగ పోస్ట్

**హైదరాబాద్, జులై 4 :** ఇరవై ఏళ్ల రాజకీయ ప్రస్థానం తన జీవితంలో ప్రత్యేక అధ్యాయమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. తన రెండు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం గురించి ఎక్స్‌లో భావోద్వేగ పోస్ట్ చేశారు. ఈ 20వసంతాల ప్రయాణం ఎన్నో విజయాలు, మరెన్నో సవాళ్లు... ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం...అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలతోనే తన అనుబంధాన్ని కొనసాగించినట్లు తెలిపారు. మిడ్జిల్‌లో సాధారణ రాజకీయ కార్యకర్తగా ప్రారంభమైన తన ప్రయాణం, ఇవాళ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ప్రజల గుండెల్లో 'రేవంతన్న'గా నిలిచే స్థాయికి చేరడం వెనుక ప్రజల విశ్వాసమే కారణమని సీఎం పేర్కొన్నారు. లక్షల అక్షరాలతో రాసినా... కోట్ల పదాలతో చెప్పినా... ఈ రెండు దశాబ్దాల ప్రజా జీవితం ఒక మధుర జ్ఞాపకమని పేర్కొన్న రేవంత్ రెడ్డి... ప్రతి సందర్భంలో, ప్రతి సంఘటనలో, ప్రతి సంఘర్షణలో తనతో కలిసి నడిచిన ప్రజలు, కార్యకర్తలు, ఆత్మీయులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ప్రజలకు మరింత సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతానని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ పునర్నిర్మాణంలో శ్రామికుడిగా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే సేవకుడిగా తన బాధ్యతను నిర్వర్తిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా మాత్రమే కాకుండా...'రేవంతన్న'గా ప్రజల హృదయాల్లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటానని భావోద్వేగంగా పేర్కొన్నారు.

# అభివృద్ధి కార్యాక్రమాల్లో వేగం పెంచాలి

(మొదటిపేజీ తరువాయి)

అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న సంకల్పంతో గ్రామీణ ప్రాంతాలలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతమైంది. ఇది దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇదే స్ఫూర్తిని క్యూర్ పరిధిలో చేపట్టబోయే అఫర్డబుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్ పై కూడా చూపించాలన్నారు. క్యూర్ పరిధిలో పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలో ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆలోచనల మేరకు రెవెన్యూ , హౌసింగ్ విభాగాల అధికారులు సమిష్టిగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వీలైనంత త్వరితగతిన పేదలకు ఇళ్లు అందించే విధంగా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఇప్పటికే ఖరారైన స్థలాలలో పొజిషన్ తీసుకొని ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన కార్యాచరణను వేగవంతంగా రూపొందించాలి. ఇంకా కొన్ని నియోజకవర్గాలలో స్థలాలను గుర్తించి తక్షణమే ఖరారు చేయాలి. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాలకు గాను ప్రతి నియోజకవర్గంలో తొలి విడతలో 500 ఇళ్లు నిర్మిస్తున్నాం. ఈ ఇళ్లకు సంబంధించి టెండర్లను వీలైనంత త్వరలో ఖరారు చేస్తాం అని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పది ఆర్డీవో,



107 తహశీల్దార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రెండు డిఐజి , నాలుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్ 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నాం. ఈ భవనాలన్నీ ఒకే డిజైన్‌లో ఉంటాయన్నారు. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సదుపాయాలతో, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మిస్తున్నాం. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఆదా, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో సోలార్ పార్కింగ్ సదుపాయాలు కల్పిస్తాం' అని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి వి.పి. గౌతమ్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# కవితకు ఎన్నికల సంఘం షాక్

- టిఆర్ఎస్ పార్టీ పేరు మార్చుకోవాలని నోటీస్
- అలాంటి ప్రసక్తి లేదంటూ స్పష్టం చేసిన కవిత
- అవసరమైతే సుప్రీంపు ఆశ్రయిస్తామని వెల్లడి

**హైదరాబాద్, జులై 4 :** కల్వకుంట్ల కవిత స్థాపించిన 'తెలంగాణ రక్షణ సేన' టీఆర్ఎస్ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం షాక్ ఇచ్చింది. కవిత కొత్త పార్టీ పేరును మార్చాలంటూ ఈసీ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ రక్షణ సేన పేరుపై ప్రజల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయని ఎలక్షన్ కమిషన్ పేర్కొంది. 15 రోజుల్లో మూడు ప్రత్యామ్నాయ పేర్లు సమర్పించాలని ఆదేశించింది. లేని పక్షంలో దరఖాస్తును మూసివేస్తామని హెచ్చరించింది. టీఆర్ఎస్ పేరును కొనసాగించేందుకు వీల్లేదంటూ కవితకు ఈసీ లేఖ రాసింది. పేరు వివాదంతో కవిత కొత్త పార్టీ రిజిస్ట్రేషన్‌కు తీవ్ర అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో కొత్త పేర్లతో దరఖాస్తును సవరించాలని ఈసీ సూచించింది. ఈసీ లేఖపై కవిత స్పందించారు. తమకు అధికారికంగా ఈసీ నుంచి వచ్చిన రెండు అభ్యంతరాలకు సమాధానం ఇచ్చామని తెలిపారు. అయితే కొత్త పేర్లు ఇచ్చేది లేదని.. న్యాయపోరాటానికే సిద్ధమని కవిత స్పష్టం చేశారు. తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సంచలనంగా మారిన కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీ 'తెలంగాణ రక్షణ సేన' సంక్షిప్త నామంపై కేంద్ర ఎన్నికల సంఘం (ఇఅఎ) పంపిన లేఖ రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. పార్టీ పేరు మార్చుకోవాలంటూ ఈసీ పంపిన నోటీసులపై పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత అత్యంత ఘాటుగా స్పందించారు. కేంద్ర ఎన్నికల సంఘం లేఖ తమకు అందిందని, వారు లేవనెత్తిన రెండు ప్రధాన అభ్యంతరాలకు తాము ఇప్పటికే పూర్తిస్థాయిలో చట్టపరమైన సమాధానాలు ఇచ్చామని ఆమె స్పష్టం చేశారు. తమ పార్టీ సంక్షిప్త నామం ఎప్పటికీ 'టిఆర్ఎస్ మాత్రమేనని ఆమె తేల్చి చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచించినట్లుగా తాము కొత్త పేర్లు గానీ, ప్రత్యామ్నాయ సంక్షిప్త నామాలు గానీ ఇచ్చే ప్రసక్తే లేదని కవిత మీడియా ముఖంగా కుండబద్దలు కొట్టారు. ప్రజా క్షేత్రంలో ఇప్పటికే

TRS
తెలంగాణ రక్షణ సేన
TELANGANA RAKSHANA SENA

'టిఆర్ఎస్ పేరుతో తాము దూసుకుపోతున్నామని, ఈ తరుణంలో వెనక్కితగ్గే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఒకవేళ ఈసీ తమ వివరణను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తే, దీనిపై అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపోరాటం చేయడానికి కూడా తాము సిద్ధంగా ఉన్నామని ఆమె స్పష్టం చేశారు. పిలుపునిచ్చారు. భారత్ రాష్ట్ర సమితి నుంచి బయటకు వచ్చిన తర్వాత కవిత అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కొత్త పార్టీని స్థాపించి, తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ రాజేసేలా 'టిఆర్ఎస్ ' అనే సంక్షిప్త నామాన్ని ఎంచుకున్నారు. గతంలో తన తండ్రి కేసీఆర్ నేతృత్వంలో కొనసాగిన పాత పేరును గుర్తుచేసేలా ఉండటంతో ఈ పేరు ప్రజల్లోకి వేగంగా దూసుకెళ్లింది. అయితే, టెక్నికల్ మరియు లీగల్ అభ్యంతరాల నేపథ్యంలో ఈసీ నుంచి 15 రోజుల గడువుతో నోటీసులు రావడం, దానికి కవిత ధీటుగా బదులివ్వడం తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పరిణామం కవిత రాజకీయ ప్రస్థానానికి ఒక సవాల్‌గా మారినప్పటికీ, ఆమె దీనిని చట్టపరంగా ఎదుర్కొనేందుకు వ్యూహాలు రచిస్తున్నారు.

# భద్రకాళి ఆలయం వద్ద ఉద్రిక్తత

- బిజెపి నేతలను అడ్డుకున్న పోలీసులు
- కాంగ్రెస్, బిఆర్ఎస్ అపవిత్రం చేశారంటూ ఆరోపణ
- పరస్పర విమర్శలతో స్థానికంగా ఉద్రికత

**వరంగల్,జులై4 :** వరంగల్ నగరంలోని ప్రముఖ భద్రకాళీ ఆలయం వద్ద వరుసగా రెండోరోజు శనివారం కూడా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు తడిబట్టలతో ఆలయంలో స్నానాలు చేయడం వల్ల ఆలయం అపవిత్రమైందని ఆరోపిస్తూ, ఆలయ సంప్రోక్షణ నిర్వహించేందుకు బీజేపీ నేతలు, కార్యకర్తలు ఆలయానికి చేరుకున్నారు. అయితే, పరిస్థితులు ఉద్రిక్తంగా మారే అవకాశం ఉందని భావించిన పోలీసులు బీజేపీ నాయకులను ఆలయ ప్రాంగణంలోకి అనుమతించలేదు. దీంతో బీజేపీ కార్యకర్తలు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఆలయం పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆలయ పవిత్రతకు భంగం కలిగిందని పేర్కొంటూ సంప్రోక్షణ నిర్వహించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. మరోవైపు, శాంతిభద్రతల దృష్ట్యా ముందస్తు చర్యగా వారిని అడ్డుకున్నట్లు పోలీసులు తెలిపారు. భద్రకాళీ ఆలయం వద్ద జరిగిన ఈ పరిణామంతో రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ఆలయ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులో ఉంచేందుకు చర్యలు చేపట్టారు. వరంగల్‌లో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ భూముల వేలం వ్యవహారం రాజకీయ రగడ సృష్టిస్తోంది. ఈ వేలం వ్యవహారంలో అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం భద్రకాళి అమ్మవారి ఆలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. ఆ తర్వాత 'కుడా' ఛైర్మన్ వెంకట్రామిరెడ్డి ఇతర కాంగ్రెస్ నాయకులు తడి దుస్తులతో అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అధికార, విపక్ష సవాళ్లతో భద్రకాళి ఆలయంలో ఉద్రిక్తత నెలకొంది. ఆలయాన్ని రాజకీయాలతో అపవిత్రం చేశారని.. సంప్రోక్షణకు భాజపా పిలుపునివ్వడంతో తాజాగా మరోసారి రాజకీయం వేడెక్కింది. 'శుద్ధి' కార్యక్రమం పేరుతో ఆలయం వద్దకు వచ్చిన భాజపా నేతలను పోలీసులు అరెస్ట్ చేయడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట చోటు చేసుకుంది. పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

# ఆస్ట్రేలియా పర్యటనకు ముందే బెదిరింపులు

## ఫేస్‌బుక్ పోస్ట్ ద్వారా ప్రధాని మోడీకి హెచ్చరికలు

**న్యూఢిల్లీ, జూలై 4 :** భారత ప్రధాని నరేంద్ర మోదీ త్వరలో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా బెదిరింపులు వచ్చాయి. మెల్‌బోర్న్ మీట్స్ మోదీ పేరిట జరగనున్న ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాల ప్రమోషన్ కోసం ఉద్దేశించిన ఒక ఫేస్ బుక్ పోస్టుకు కామెంట్ రూపంలో నిందితులు ఈ బెదిరింపులకు దిగారు. అబూ ముస్తాఫా పేరిట ఉన్న అకౌంట్ నుంచి నిందితులు ఈ పోస్టు పెట్టారు. 'స్టేడియం రూఫ్‌టాప్‌ను మూసేస్తే మంచిది. ఈ కార్యక్రమానికి మోదీ రావడమంటే మృత్యువు కోసం వస్తున్నట్టే' అని కామెంట్ చేశారు. ఈ ఘటనపై ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసులు ఇప్పటికే రంగంలోకి దిగారు. ఏ ఐపీ అడ్రస్ నుంచి ఈ పోస్టు వచ్చిందో గుర్తించారు. అయి–ంతే, ఈ ఉదంతంలో ఎవరినైనా అరెస్టు చేశారా? లేదా? అనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనను తీవ్రంగా పరగణిస్తున్నామని ఆస్ట్రేలియా అధికారులు తెలిపారు. పలు దర్యాప్తు సంస్థలు ఈ ఘటనపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాయి. ఇక ప్రధాని మోదీ జులై 8–10 మధ్య ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారు. జులై 9న మెల్‌బోర్న్ మీట్స్ మోదీ ఈవెంట్‌లో పాల్గొంటారు. ఈ పర్యటన సందర్భంగా ఆస్ట్రేలియా–ఇండియా వార్షిక సమావేశంలో కూడా మోదీ పాల్గొంటారు.

# ట్రిపుల్ ఐటి విద్యార్థి ఆత్మహత్య

**హైదరాబాద్,జూలై4 :** గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీలో అభిరూప్ (20) అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆరో అంతస్తు నుంచి కిందికి దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం బయ్యారం గ్రామానికి చెందిన అభిరూప్ ట్రిపుల్ ఐటీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఓ వైపు చదువు ఒత్తిడి, మరోవైపు అనారోగ్య సమస్యలు ఎక్కువ కావడంతో.. తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. ఆరో అంతస్తు నుంచి దూకడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి వారు చెబుతున్నారు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటన స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

# అయోధ్య విరాళాల చోరీతో దిద్దుబాటు చర్యలు

- ఇక నుంచి లెక్కింపులో కఠిన నిబంధనలు
- లెక్కింపు సిబ్బందికి సెల్‌ఫోన్ల నిషేధం
- జేబులు లేని దుస్తులు వేసుకునేలా ఆదేశాలు
- నిరంతరం సిసి టివిల పర్యవేక్షణలో నేలపై లెక్కింపు



**అయోధ్య, జూలై 4 :** అయోధ్య రామ మందిరంలో విరాళాల చోరీపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ విరాళాల లెక్కింపు వ్యవస్థలో కఠిన నిబంధనలు అమలు చేయాలని నిర్ణయించింది. విరాళాల లెక్కింపు వ్యవస్థలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కఠిన నిబంధనలను అమల్లోకి తెచ్చింది. విరాళాలు లెక్కించే సమయంలో సిబ్బంది మొబైల్ ఫోన్లు, కెమెరాలు, బ్యాగులు, ఇతర వ్యక్తిగత వస్తువులు ఉపయోగించడంపై పూర్తి స్థాయి-ంలో నిషేధం విధించింది. టేబుళ్లు, కుర్చీల దగ్గర కాకుండా.. సిబ్బంది నేలపై కూర్చునే విరాళాలను లెక్కించాలని ఆదేశించింది. డ్రెస్ కోడ్‌ను తప్పని సరి చేసింది. సిబ్బంది జేబులు లేని డార్క్ బ్లూ యూనీఫామ్ మాత్రమే ధరించాలని ఆదేశించింది. విరాళాలు లెక్కించే సమయంలో సిబ్బంది మొబైల్ ఫోన్లు, కెమెరాలు ఉపయోగించడాన్ని నిషేధించింది. అదే విధంగా సదరు సిబ్బంది ఎలాంటి జేబులు లేని ప్రత్యేకమైన దుస్తులను ధరించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇకపై, హుండీ లెక్కింపు హాలులోకి సిబ్బంది ప్రవేశించడానికి ముందు వారికి రెండంచెల భద్రతా తనిఖీలు నిర్వహించనున్నారు. విరాళాల లెక్కింపు విధానంలో కూడా సమూల మార్పులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇకనుంచి సిబ్బంది బల్లలు, కుర్చీల వద్ద కాకుండా, నేలపై కూర్చొనే విరాళాలను లెక్కిస్తారని తెలిపారు. నగదు, ఇతర విలువైన వస్తువులు దాచుకొనేందుకు అవకాశం లేకుండా ఉండేలా సిబ్బందికి జేబులు లేని ముదురు నీలం రంగు యూనిఫాం ఇవ్వనున్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్' ఖాతాలపై ఆడిట్ నిర్వహించడానికి సిట్ సిద్ధమవుతున్నట్లు అధికారులు వెల్లడించారు. గత ఐదేళ్లలో ఆలయ నిర్మాణానికి అయిన ఖర్చులు, ఆలయానికి వచ్చిన విరాళాలు, నిధులను వారు సమీక్షించనున్నారు. దొంగలించిన నగలను ఎవరూ గుర్తు పట్టకుండా ఉండడానికి నిందితులు వాటిని కరిగించి.. బంగారు బిస్కెట్లుగా మార్చుకొని ఉంటారని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. విరాళాలు లెక్కించే సిబ్బందిని కౌంటింగ్ హాలులోకి పంపడానికి ముందు రెండు సార్లు సెక్యూరిటీ స్క్రీనింగ్ చేయనున్నారు. విరాళాలు లెక్కించే హాలు 24 గంటల పాటు నిరంతరం సీసీటీవీ కెమెరాల నిఘాలో ఉ ంటుంది. గతంలో లాగా ఫుటేజ్ డిలీట్ అవ్వకుండా ఉండేలా డేటా స్టోరేజ్ గడువును కూడా పెంచారు. కాగా, ప్రత్యేక విచారణ బృందం సూచనల మేరకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఈ కఠినమైన నిబంధనలను అమలులోకి తెచ్చింది.

# అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం

### ట్రంప్‌కు, అమెరికా ప్రజలకు మోదీ శుభాకాంక్షలు



**న్యూఢిల్లీ, జూలై 4 :** అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడితో పాటు ఆ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే 250 సంవత్సరాలు అమెరికాకు మరిం త గొప్ప శ్రేయస్సు, శాంతి, పురోగతిని తీసుకురావాలని మోదీ ఆకాంక్షించారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ శనివారం తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'అమెరికా చరిత్రాత్మక 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు, అమెరికా ప్రజలకు.. 140 కోట్ల మంది భారతీయుల తరపున నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. భారత్, అమెరికాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మించిన బంధం ఉంది. ప్రజాస్వామ్యం, చట్టబద్ధమైన పాలనపై ఉన్న ఉమ్మడి నమ్మకం, ప్రజల అపరిమితమైన సామర్థ్యాలు.. రెండు దేశాల మధ్య స్నేహాన్ని ప్రపంచ శ్రేయస్సుకు ఒక శక్తిగా మారుస్తున్నాయి. రాబోయే 250 సంవత్సరాలు అమెరికాకు మరింత గొప్ప శ్రేయస్సు, శాంతి, పురోగతిని తీసుకురావాలని.. అలాగే భారత్-అమెరికా భాగస్వామ్యాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను' అని రాసుకొచ్చారు.

# నీలోఫర్‌లో పసికందును వదిలేసిన తల్లిదండ్రులు

**హైదరాబాద్, జులై 4:** అనారోగ్యంతో బాధపడుతున్న రోజుల పసికందును తల్లిదండ్రులు నిర్దయగా వదిలేసి వెళ్లిపోయారు. ఈ దారుణ ఘటన నగరంలోని నాంపల్లి నీలోఫర్ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. ఒడిశాకు చెందిన దంపతులు తమ ఆరు రోజుల మగ శిశువును ఆస్పత్రిలో చేర్చారు. శిశువు శ్వాసకోస సమస్యతో బాధపడుతున్నాడు. ఏప్రిల్ 25న శిశువును నీలోఫర్‌లో చేర్చిన తల్లిదండ్రులు అక్కడి నుంచి అదృశ్యమయ్యారు. పసికందుకు సంబంధించిన వారు ఎవరూ లేకపోవడంతో ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పసికందును నీలోఫర్ ఆస్పత్రి వైద్యులు ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. ఎన్‌బీసీయూలో చికిత్స అందించి.. శిశువును కాపాడారు. ఆసుపత్రి ఆర్‌ఎంఓ ఫిర్యాదు మేరకు నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పసికందును సంరక్షణ కోసం శిశు విహార్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. శిశువు తల్లిదండ్రులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

# మమతా బెనర్జీకి మరో ఎదురుదెబ్బ

### పార్టీ రాష్ట్ర అధ్యక్షపదవికి చంద్రిమా రాజీనామా

**కోల్‌కతా,జులై4 :** తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే పార్టీకి చెందిన కీలక నేతలు పెద్ద సంఖ్యలో రాజీనామాలు చేశారు. మరి కొందరు రెబల్స్‌గా మారి పార్టీని సొంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి సమయంలో మమతకు ఊహించని షాక్ తగిలింది. సీనియర్ నేత చంద్రిమా భట్టాచార్య టీఎంసీ పార్టీ రాష్ట్ర ప్రెసిడెంట్ పదవికి శనివారం రాజీనామా చేశారు. అంతేకాదు.. పార్టీలో తనకు కేటాయించిన అన్ని పదవులకు కూడా ఆమె రాజీనామా చేశారు. మొన్నటి పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని చవిచూసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మమతా బెనర్జీ కీలక నిర్ణయం తీసుకున్నారు. పాత కమిటీలను రద్దు చేసి, కొత్త కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే చంద్రిమా భట్టాచార్యను జూన్ మొదటి వారంలో రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమించారు. పదవిలోకి వచ్చిన కేవలం నెల రోజుల్లోనే ఆమె తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ బహిష్కృత ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గం కోల్‌కతాలోని పార్టీ ప్రధాన కార్యాలయాన్ని శుక్రవారం స్వాధీనం చేసుకుంది. తమదే అసలైన టీఎంసీ అని ప్రకటిస్తూ ఓ సమావేశం కూడా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో రితబ్రతతో పాటు ఫిర్హాద్ హకీమ్, జావేద్ ఖాన్, సందీపన్ సాహా, అఖ్రూజమాన్ తదితరులు పాల్గొన్నారు.



# రేవంత్ రెడ్డికి బండి శుభాకాంక్షలు

**హైదరాబాద్, జూలై 4 :** ప్రజా జీవితంలో రెండు దశాబ్దాలు పూర్తి చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఇద్దరూ కూడా కష్టపడి పైకొచ్చినవారే అని అన్నారు. సీఎం రేవంత్ 6 గ్యారంటీలు అమలు చేయాలని కోరారు. సర్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. హిందువుల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని కేంద్ర మంత్రి విమర్శించారు. ఇదే జరిగితే తెలంగాణలో హిందువులే మైనారిటీలయ్యే ప్రమాదం ఉందన్నారు. మజ్లిస్‌తో కుమ్మక్కై హిందువుల ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. అధికారులకు ప్రభుత్వం సహకరించడం లేదని బండి సంజయ్ పేర్కొన్నారు.

# జోసెఫ్, ప్రకాశ్ రాజ్‌ల మధ్య అక్రమ సంబంధం

- నిజమైన ప్రజానాయకుడు మన రేవంత్
- ప్రజల కోసం పరితపించే పెద్ద మనసు ఆయన సొంతం
- నిరంతరం పేదల సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తున్న వ్యక్తి
- మిడ్జిల్ సభలో సిఎం రేవంత్‌పై భట్టి ప్రశంసలు



**నాగర్‌కర్నూలు, జూలై 4 :** తనను ఆదరించిన ప్రజల దీవెన పొందాలని, వారికి కృతజ్ఞతలు తెలపాలని వచ్చిన సిఎం రేవంత్ రెడ్డిది పెద్ద మనసని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రజలకు సేవ చేయాలన్న తపన, పేదలను ఆదుకోవాలన్న ఆకాంక్ష రేవంత్ రెడ్డిలో ఉన్నాయని అన్నారు. రేవంత్‌ను దగ్గరగా చూసిన వ్యక్తిగా ఆయనలో ఉదాత్తమైన ఆశయాలు ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా మిడ్జిల్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. రెండు దశాబ్దాల క్రితం తనను జడ్పీటీసీగా దీవించిన ఈ ప్రాంత ప్రజల చెంతకు, నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా మారి కృతజ్ఞతలు చెప్పుకోవడానికి రావడం రేవంత్ రెడ్డి ఉన్నతమైన సంస్కారానికి నిదర్శనమని కొనియాడారు. కేవలం అధికారుల సలహాలకే పరిమితం కాకుండా, పేదోడి కష్టాలు స్వయంగా తెలిసిన నాయకుడిగా రేవంత్ రెడ్డి క్షేత్రస్థాయిలో అద్భుతమైన ప్రజాపాలన అందిస్తున్నారని, ప్రకృతి కూడా ఆశీర్వదించేంత మంచి సంకల్పంతో ఆయన నిరంతరం ప్రజల కోసమే పరితపిస్తున్నారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆకలి లేని సమాజమే లక్ష్యంగా కోటి పదిహేను లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని, అలాగే 27 లక్షల మంది విద్యార్థులకు పాఠశాలల్లో పౌష్టికాహారం అందించడం ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధతను చాటుతోందని భట్టి విక్రమార్క వివరించారు. నిరుపేదలకు అండగా ఇందిరమ్మ ఇళ్లు, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం అక్కాచెల్లెమ్మలకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ ప్రజా సంక్షేమమే అజెండాగా ఈ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గత పాలకుల హయాంలో నిరంతరం భయంతో బతికిన తెలంగాణ ప్రజలకు, నేడు నిజమైన స్వేచ్ఛా స్వతంత్ర జీవనాన్ని ప్రసాదించిన ధీశాలి రేవంత్ రెడ్డి అని డిప్యూటీ సీఎం కొనియాడారు.

# నగర హోటళ్లలో నాణ్యత డొల్ల

- అపరిశుభ్ర వాతావరణం.. కల్తీ పదార్థాలు
- దాడులు చేస్తున్నా పట్టించుకోకుండా అమ్మకాలు
- వందరోజుల్లో 185 కేసులు నమోదు

**హైదరాబాద్, జులై 4 :** ఆహార కల్తీపై హెచ్-ఫాస్ట్ ఉక్కుపాదం మోపింది. నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో దాడులు చేసిన హెచ్-ఫాస్ట్ అధికారులు భారీగా కేసులు నమోదు చేశారు. 100 రోజుల్లో దాదాపు 185 కేసులను నమోదు చేశారు. దాడుల్లో 121.87 టన్నుల కల్తీ, నాణ్యతలేని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మార్చి 19న ప్రారంభమైన హెచ్-ఫాస్ట్ దాడులకు 100 రోజులు పూర్తి అయ్యింది. ఈ వంద రోజుల్లో రాజేంద్రనగర్ జోన్‌లో అత్యధికంగా 55 కేసులు, గోల్కొండలో 44 కేసులు నమోదు అయ్యాయి. దాదాపు 27 టన్నులకు పైగా నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. రసాయనాలతో మగ్గబెట్టిన 25.8 టన్నుల పండ్లను అధికారులు సీజ్ చేశారు. 60 టన్నులకు పైగా చికెన్ వ్యర్థాలు, 15 టన్నుల నాణ్యతలేని చికెన్, మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. హెచ్-ఫాస్ట్ అధికారుల దాడుల్లో కల్తీ కోవా, పనీర్, పెరుగు, నెయ్యి, క్రీమ్, టీ పొడి భారీగా పట్టుబడింది. ఆరోగ్యానికి హానికరమైన 247 కేసులను జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగానికి బదిలీ చేశారు. ప్రజల ఫిర్యాదుల ఆధారంగా 90 కేసులు నమోదవగా... పనీర్ అవుట్‌లెట్లపై 70 కేసులు నమోదు అయ్యాయి. నాణ్యమైన ఆహారం విషయంలో హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలకు హెచ్-ఫాస్ట్ అధికారులు కఠిన మార్గదర్శకాలు జారీ చేశారు. ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్స్, ఈఎతీక్ష విధానం, వాడిన నూనె పునర్వినియోగంపై ఆంక్షలు విధించారు. కల్తీ మాఫియాపై అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని సీపీ వీసీ సజ్జనర్ హెచ్చరిక జారీ చేశారు. ప్రతి రోజు సగటున 15 కల్తీ ఆహార ఫిర్యాదులు అందుతున్నట్లు వెల్లడించారు. కల్తీ సమాచారం ఉంటే డయల్ 100, వాట్సాప్, ఫోన్ నంబర్ 8712661212కు సమాచారం ఇవ్వాలని సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

# యువతకు కండరాలు పెంచే స్టెరాయిడ్స్

### అక్రమంగా ఇంజక్షన్లు విక్రయిస్తున్న ముఠా వలపన్ని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

**హైదరాబాద్, జూలై 4 :** క్షణాల్లో కండరాలు పెంచుకోవాలనే యువత ఆకాంక్షను ఆసరాగా చేసుకుని అక్రమంగా స్టెరాయిడ్స్ ఇంజెక్షన్లు విక్రయిస్తున్న ముఠాను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్, ముషీరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో మొత్తం ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.6.50 లక్షల విలువైన 770కి పైగా స్టెరాయిడ్స్ వయల్స్, యాంపూల్స్, ఇంజెక్షన్లతో పాటు మొబైల్ ఫోన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ తెలిపిన వివరాల ప్రకారం.. 'డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండానే జిమ్ ట్రైనర్లు స్టెరాయిడ్స్‌ను ఆన్‌లైన్ ద్వారా తెప్పించి యువతకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. ఆన్‌లైన్ జిమ్ ట్రైనర్ బట్టే శివ, మహమ్మద్ ఫుర్ఖానుద్దీన్ ఫైసల్‌తో పాటు మరో నలుగురు సబ్-సెల్లర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన 'మెడ్‌హౌస్ ఫార్మా', పంజాబ్‌కు చెందిన 'షిప్ రాకెట్' వంటి ఆన్‌లైన్ వేదికల ద్వారా స్టెరాయిడ్స్ కొనుగోలు చేసి, కొరియర్ సేవల ద్వారా హైదరాబాద్‌కు తెప్పించి విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముదిద్ చౌహాన్, పంజాబ్‌కు చెందిన రాజన్ ప్రీత్ సింగ్ పరారీలో ఉన్నారని' తెలిపారు. ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నిందితులపై రెండు వేర్వేరు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అలాగే కొంతమంది యువకులు కృత్రిమ మేధస్సు సాయంతో నకిలీ వైద్యుల ప్రిస్క్రిప్షన్లు రూపొందించి మెడికల్ షాపుల నుంచి కూడా స్టెరాయిడ్స్ కొనుగోలు చేస్తున్నట్లు విచారణలో బయటపడిందని తెలిపారు.

# సత్యసాయి ఆస్పత్రిని సందర్శించిన విజయ్ దేవరకొండ

### ఇక్కడ చిన్నారులకు హృద్రోగ చికిత్సలు చేయడం అభినందనీయం
### సత్యసాయి స్కూల్ విద్య వల్లనే ఇంతటి వాడినయ్యానని వెల్లడి



**సిద్దిపేట, జూలై 4 :** జిల్లాలోని కొండపాక సత్యసాయి సంజీవని శిశు హృదయాలయ హాస్పిటల్‌ను సినీ నటుడు విజయ్ దేవరకొండ, మాజీమంత్రి హరీశ్ రావు సందర్శించారు. ఆస్పత్రిలో 500 మంది చిన్నారులకు గుండె ఆపరేషన్లు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ప్రతి ఏటా 6000 గుండె ఆపరేషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ఇక్కడెక్కడి నుంచో పిల్లలు సత్యసాయి ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకుంటున్నారన్నారు. ప్రతి మనిషి తనకు చేతనైన సాయం చేయాలని... మనం చేసిన మంచే చివరకు మిగులుతుందని చెప్పుకొచ్చారు. తన ఏడాది జీతాన్ని ఈ దేవాలయానికి విరాళంగా ఇస్తున్నట్లు హరీశ్ ప్రకటించారు. పుట్టిన బిడ్డ గుండెలో రంధ్రం ఉంది, ప్రాణాలు నిలవడం కష్టం అన్న స్థితిలో వారికి ప్రాణాలు పోస్తే.. ఆ చిన్నారి ప్రాణాలతో పాటు వారి తల్లిదండ్రులు ప్రాణాలనూ కాపాడినట్లు అవుతుందన్నారు. ఈ ఆస్పత్రిని రాబోయే రోజుల్లో రీసెర్చ్ సెంటర్‌గా అభివృద్ధి చేస్తామని చైర్మన్ చెప్పారన్నారు. తెలంగాణ నుంచి స్వతహాగా హీరోగా ఎదిగిన వ్యక్తి విజయ్ దేవరకొండ అని.. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే స్వభావం ఆయనదని కొనియాడారు. కరోనా సమయంలో వేలాది మందికి సాయం అందించారని గుర్తుచేశారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు సత్యసాయి స్కూల్లోనే విజయ్ దేవరకొండ చదివారన్నారు. ఇక్కడ కులం, మతం లేదని.. ఆపదలో ఉన్న పిల్లలకు సేవలందిస్తున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. అనంతపురంలో ఓ వ్యక్తి ఏర్పాటు చేసిన వ్యవస్థ ఎన్నో రకాల సేవలందిస్తోందని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. 'ఈరోజు నేను ఇలా ఉన్నానంటే సత్యసాయి స్కూల్లో అందించిన విద్యే కారణం. కొందరు వ్యక్తులు చూపించే ప్రేమ, దయ వల్ల అనేక మంది జీవితాలు మారిపోతాయి. అలాంటి ప్రేమను చూపించిన గొప్ప వ్యక్తి సత్యసాయి. ఇక్కడ చికిత్స పొందిన చిన్నారులు రేపు ఎలాంటి మార్పులు తీసుకొస్తారో సమాజం చూస్తుంది. ఒక లీడర్ తీసుకున్న నిర్ణయం ఈ ప్రాంతానికి, పిల్లల వైద్యానికి ఎంతో మేలు చేస్తోంది. హరీశ్ రావు తీసుకున్న నిర్ణయం, శ్రమ వల్ల ఇంత గొప్ప ఆస్పత్రి ఇక్కడికి వచ్చింది. చైర్మన్ శ్రీనివాస్, ఆయన వైద్య బృందం చేస్తున్న సేవలు వెలకట్టలేనివి' అని విజయ్ దేవరకొండ కొనియాడారు.

# భార్యను కత్తితో పొడిచి చంపిన భర్త

**హైదరాబాద్, జూలై 4 :** ఉప్పల్ పోలీసు స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. ఆదర్శ నగర్‌లో సురేశ్ తన భార్య జెస్సికాను కత్తితో పొడిచి హత్య చేశాడు. నర్సుగా పని చేస్తున్న భార్యపై కొంతకాలంగా అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఇవాళ ఉదయం జెస్సికాను హత్య చేసి.. అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికుల నుంచి సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పరారీలో ఉన్న సురేష్ కోసం గాలిస్తున్నారు.



# ప్రజారోగ్య పరిరక్షణకు పకడ్బందీ చర్యలు

- ఆహార భద్రతను కట్టుదిట్టంగా అమలు
- డ్రగ్ కంట్రోలర్, ఫుడ్ సేఫ్టీ విభాగాలు కలసి పనిచేయాలి
- అధికారులకు సిఎస్ సంజయ్ జాజూ ఆదేశం

**హైదరాబాద్, జూలై 4 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజారోగ్య పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఆహార భద్రతా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని, కల్తీ ఆహార పదార్థాలపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం తనిఖీలు చేపట్టాలని సిఎస్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శనివారం సిఎస్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్ కంట్రోలర్ విభాగం, ఫుడ్ సేఫ్టీ విభాగాలు సమన్వయంతో పని చేస్తూ రాష్ట్రంలో ఆహార భద్రతా ప్రమాణాల అమలు, నాణ్యతలపై నిరంతరం తనిఖీలు నిర్వహించి ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఉన్న రెండు విభాగాలను ఏకతాటిపై నడిపేందుకు తగిన ప్రతిపాదనలను వారం రోజుల్లోగా సిద్ధం చేయాలని సిఎస్ సూచించారు. దీంతో ఆయా విభాగాలు సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు అవకాశం ఉందన్నారు. ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న విధానాన్ని అధ్యయనం చేసి మన రాష్ట్రంలో కూడా తగిన విధంగా అమలు చేసేందుకు తగిన ప్రణాళికలను రూపొందించాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన కేసులు, వాటి పురోగతి, సిబ్బంది తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో సిఎం సలహాదారు, ఎక్స్-అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డిజిపి సి.వి.ఆనంద్, సిఎంఒ ప్రిన్సిపల్ సెక్రటరీలు శేషాద్రి, ఎన్.శ్రీధర్, జిఎడి ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీం, అడిషనల్ డిజి(ఇంటెలిజెన్స్) విజయ్ కుమార్, వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా చొంగ్తూ, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, వైద్యశాఖ కమిషనర్ సంగీతా, డ్రగ్ కంట్రోలర్ డిజి అవినాష్ మొహంతి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వర్షాభావ జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించండి

- ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను సిద్ధం చేయండి
- రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించండి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎస్ సంజయ్ జాజు

**హైదరాబాద్, జూలై 4 :** తక్కువ వర్షపాతం నమోదైన జిల్లాల అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లు సిఎస్ సంజయ్ జాజు ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు జిల్లాల వారీగా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను తక్షణమే సిద్ధం చేయాలని, దీనివల్ల రైతులకు ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయం, ఆరోగ్యం, సురక్షిత తాగునీరు, విద్యా శాఖల పురోగతిపై సుదీర్ఘంగా సమీక్షించిన ఆయన, రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా జరిగేలా గట్టి నిఘా ఉంచాలని, పంటల వైవిధ్యంపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో కాలానుగుణ వ్యాధుల నివారణకు వివిధ శాఖల మధ్య సమన్వయం తప్పనిసరని సీఎస్ స్పష్టం చేశారు. పారిశుధ్యం, దోమల నియంత్రణపై ప్రత్యేక చర్యలు చేపడుతూనే, వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలని, విద్యుత్ సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా కొరత లేకుండా సురక్షిత తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్లను ఆదేశించారు. విద్యా శాఖకు సంబంధించి, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంటశాలలకు అనువైన స్థలాలను గుర్తించి, అక్కడ మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయాలన్నారు. ఈ ప్రాధాన్యతా అంశాలన్నింటినీ కలెక్టర్లు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, నిరంతర సమీక్షలు జరపాలని సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు.

# సర్ ప్రక్రియకు రాజకీయ పార్టీలే సహకరించాలి!



**సర్ ప్రక్రియతో ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలు కంగారు పడుతున్నాయి. ఇబ్బడిముబ్బడిగా ఉన్న మద్దతుదారుల ఓట్లు పోతాయన్న భావనలో ఉన్నారు. ముఖ్యంగా ఆంధ్రావారిలో చాలామందికి తెలంగాణలో ఓటు ఉంది. దీనిపై వారు ఆందోళన చెందుతున్నారు. రెండు ఓట్లు ఉంటే తొలగించడం ఖాయం. అలాగే హైదరాబాద్,విజయవాడ లాంటి తదితర పట్టణాల్లో ఉన్నవారికి కూడా అటు సొంతూళ్లు, ఇక్కడా ఓట్లు ఉన్నాయి. వీటిని తొలగిస్తే ఎలా అన్న ఆందోళనలో ఉన్నారు. అన్నింటికి మించి పాతబస్తీ లోనే ఎక్కువ గందరగోళం కనిపిస్తోంది. ఇక్కడ తిష్టవేసిన రోహింగ్యాలతో పాటు, ఇతర దేశాల వారిని గుర్తించడం కొంచెం కష్టమే. ఇకపోతే అధికారులు రోజువారీ సమీక్ష చేస్తూ సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటి వరకు ఎక్కడా ఎలాంటి పొరపాట్లు రాలేదు.**

నకిలీ ఓట్లను నిరోధించేందుకు పక్కాగా ఓ వ్యవస్థ అంటూ లేదు. ఆధార్, పాన్ కార్డులకు పర్మినెంట్ నంబర్ ఉంటోంది. కానీ ఓటుకు అలాంటిదేమీ లేదు. అలాంటి పక్కా వ్యవస్త ఉంటే తప్ప ఎన్నిసార్లు సర్ ప్రక్రియ చేపట్టినా నకిలీ ఓట్లు తొలగింపు అసాధ్యమే. ఇకపోతే ఇల్లుమారిన లేదా, చనిపోయిన వారి ఓట్లను ఎలా తొలగిస్తారన్నది కూడా ప్రశ్నే. ఇదిలావుంటే అన్ని రాజకీయ పార్టీలు సమావేశాలు పెట్టి తమ కార్యకర్తలను అప్రమత్తం చేస్తున్నాయి. ఓట్లు తొలగిపోకుండా చూడాలని జాగ్రత్తలు చెబుతున్నాయి. అందుకు బూత్‌లెవల్లో శిక్షణ కూడా ఇచ్చారు. ఓ వైపు ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే సమావేశాలు కొనసాగుతున్నాయి. దీనిని బట్టి రాజకీయ పార్టీల్లో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. నకిలీ ఓట్లను తొలగించే విధానాన్ని కేంద్ర ఎన్నికల సంఘం సర్ ద్వారా గత కొన్నేళ్లుగా సంస్కరిస్తోంది. ఇది కొత్తగా బిజెపి ఏలుబడిలో తీసుకువచ్చిందేమీ కాదు. గతంలో యూపిఎ హయాంలోనూ సర్ ప్రక్రియ సాగింది. అయితే అప్పట్లో తూతమంత్రంగా సాగడంతో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. 'సర్' పక్రియ చట్టబద్ధమేనని, కానీ వాటి కోసం అవలంబించే పద్ధతుల్లో మార్పులు తెచ్చుకోవాలని ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం అన్ని రాజకీయ పార్టీలకు, కేంద్ర ఎన్నికల సంఘానికి హితవు చెప్పింది. ఓటు హక్కు ఒకటే యువత భవిష్యత్‌ను నిర్మించుకునేందుకు ఉన్న ఏకైక ఆయుధమని నమ్ముతుంటాం.

ఓటు ఉంటేనే నేతలు ఉంటారు. అధికారం ఉంటుంది. అందుకే ఓట్ల కోసం అభ్యర్థులు, పార్టీలు డబ్బులు విరజిమ్మడం ద్వారా అధికార పీఠం దక్కించుకునేందుకు నానా గడ్డీ కరుస్తుంటారు. ఇప్పుడు సర్ ప్రక్రియ ద్వారా తమవారి ఓట్లు పోకుండా జాగ్రత్త పడడం ఇందులో భాగమే.ప్రజాస్వామ్యంలో ధనస్వామ్యం చొరబడిన తరవాత ప్రజాస్వామ్యం ఇప్పుడు వికటిస్తున్నది. ఈ పరిస్థితుల్లో 'ఓటు' దుర్వినియోగం అవుతోంది. డబ్బులు పెట్టి ఓట్లు కొనసడం అలవాటు చేసుకున్నారు. దొంగ ఓట్లతో జాతర నడిపిస్తున్నారు. స్థానికంగా లేని వారికి ఓటు హక్కు కల్పించడం, ఆ ఓటును ఎవరో వేసేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో సర్' పేరుతో అసలుసిసలు ఓటర్లను జాబితాలోంచి తీసేస్తున్నారన్న ఆరోపణల మధ్య రాజకీయ పార్టీలు ఓట్లను దక్కించుకునేందుకు జాగ్రత్త పడుతున్నాయి. బీహార్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, తదితర రాష్ట్రాలకు సర్ ప్రక్రియ పూర్తయిన తరవాతనే ఎన్నికలు జరిగాయి. కొన్ని చోట్ల ప్రభుత్వాలు మారడం తో ఓట్లను తొలగిస్తున్నారన్న ప్రచారం చేపట్టారు. ఇంత ప్రక్షాళన జరిగినా కొన్ని చోట్ల అక్రమంగా తమ ఓట్లు తొలగించారన్న ఆవేదనలు వినిపిస్తూనే ఉన్నాయి. సాధారణ పౌరులెవరికీ 'సర్' పట్ల ఎలాంటి అసంతృప్తి లేదు. ఈ పక్రియలో ఓటు హక్కు కోల్పోయామని ఆందోళన చెందిన ఓటర్లు కూడా ఇప్పుడు ఒక్కక్కరూ ఆందోళన చెందుతున్నారు. ఏ వ్యవస్థలో అయినా లోపభూయిష్టమైన విధానాలకు చెక్ పెట్టాల్సిందే. ఓటు ఉన్నవారు నిర్భయమంగా ఉండాల్సిందే. ఎలాంటి ఆందోళనలు అవసరం లేదు. ఎన్నికల సంఘం కూడా అలాంటి వారిని ఎక్కడా తప్పు పట్టడం లేదు. జాబితాలో తొలగించడం లేదు. అవగాహన లేనివారు మాత్రమే ఆందోళనతో అయోమయంలో పడిపోతున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా ఎంతో విశ్వసనీయత కలిగి ఉండటం అవసరం. రెండు ఓట్లు, ఇక్కడ లేని వారి ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు తొలగించేందుకు ఇసికి రాజకీయ పార్టీలు సహకరిస్తే సమస్య సులువుగా పరిష్కారం అవుతుంది. కానీ రాజకీయా పార్టీలు అలా చేయడం లేదు. రాజకీయ పార్టీల చర్యలు ఓటర్లలోనూ గందరగోళంలఅఓ పడేసేలా ఉంటోంది.

ఓట్లు పోతాయంటూ చేస్తున్న హెచ్చరికలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారు తమ ఓటు ఎక్కడ పోతుందో అన్న ఆందోళన చెందుతున్నారు. శాశ్వతంగా ఒకే ప్రాంతంలో నివసించే వారిఓట్ల జోలికి ఇసి వెళ్లడం లేదు. కొన్ని చోట్ల తాము వెళ్లినప్పుడు ఓటర్లు అక్కడ లేకపోవడం, తగిన కారణాలు చూపక పోవడంతో తొలగించడం జరుగుతోంది. ఇంటింటికీ వెళ్లి ధృవీకరణద్వారా జాబితాను జల్లెడ పడుతున్నారు. ఒకటి కన్నాఎక్కువ ప్రాంతాల్లో పేర్లు నమోదై, వారు మరో చోట నివసిస్తుంటే వారి ఓటు హక్కు ఆ ప్రాంతానికే మార్చుకోవాలి. ఎక్కడ శాశ్వత నివాసం ఉంటుందో అక్కడే ఓటును పొందాలి. అంతేగానీ పలుచోట్ల ఓటును కలిగి ఉండడం కూడా నేరం. ఇలాంటి విషయాలను రాజకీయా పార్టీలు ప్రచారం చేయడం లేదు. రాజకీయ ఎత్తుగడ కోసం ఓట్లు తొలగిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నాయి. 'సర్' పూర్తిగా చట్టబద్ధమైన పారదర్శక పక్రియ అనడంలో సందేహమే లేదు. కేంద్ర ఎన్నికల సంఘం తరచు సమీక్షలు చేయడం ద్వారా ఓటర్ల గుర్తింపునకు వెసులు బాటుగా అవగాహన కల్పించడం, వారి ఓటుకు చోటు లభించేటట్లు చేయడం అత్యంతావశ్యకం. అవగాహనలోపం వల్ల అర్హులైన ఓటర్లు కూడా తమ 'ఓటుహక్కును దక్కించుకోవడం కోసం అజాగ్రత్తగా ఉండరాదు. రాజకీయ పార్టీలు గ్రామాల వారీగా జాబితాలు ముందుర వేసుకుంటే ఎవరు స్థానికులో ఎవరు కాదో తెలుస్తుంది. ఎవరు ఓటరో కాదో తెలుస్తుంది. చనిపోయిన వారు ఎవరో కూడా వారికి తెలుసు. ఇలాంటి విషయాల్లో ఆయా పార్టీలు నేరుగా ఎన్నికల సంఘానికి సహకరించి, అనర్హత కలిగిన ఓట్లను తొలగించాలి. అప్పుడే ఓటరు సమగ్ర జాబితా రూపొందగలదు.

# ఇరాన్ సుప్రీం ఖమేనీ అంత్యక్రియలు

- వేలాదిగా టెహ్రాన్ నగరానికి తరలివచ్చిన ప్రజలు
- భారత బృందంలో బీహార్ గవర్నర్, కేంద్రమంత్రి హాజరు





**టెహ్రాన్, జులై 4 :** అమెరికా దాడుల్లో మృతిచెందిన ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు శనివారం అధికారికంగా ప్రారంభమయ్యాయి. అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఈ ఏడాది ఫిబ్రవరి 28న మరణించిన 86 ఏళ్ల ఖమేనీకి చివరి వీడ్కోలు పలికేందుకు వేలాదిగా ప్రజలు టెహ్రాన్ నగరానికి తరలివచ్చారు. దేశ జెండాతో కప్పిన ఖమేనీ పార్థివదేహాన్ని నల్ల తలపాగా ఉంచిన శవపేటికలో పెట్టి అంతిమ సందర్శనకు ఉంచారు. అమెరికా దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన ఖమేనీ కుటుంబ సభ్యుల పార్థివదేహాలనూ ఆయన పక్కనే ఉంచారు. అందులో ఖమేనీ 14 నెలల మనవరాలి చిన్న శవపేటిక అందరి మనసులను కలచివేస్తోంది. ఆ చిన్నారి శవపేటిక పక్కనే ఆమె ఫొటోను కూడా ఉంచారు. వారం రోజుల అంతిమ సంస్కారాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రమే ఖమేనీ పార్థివదేహం టెహ్రాన్‌కు చేరుకుంది. దీంతో గ్రాండ్ మొసల్లా ప్రాంగణం వెలుపల భారీ సంఖ్యలో అభిమానులు, మద్దతుదారులు బారులు తీరారు. శనివారం ఉదయం గ్రాండ్ మొసల్లా ద్వారాలు తెరవగానే వేలాది మంది లోపలికి ప్రవేశించి ఖమేనీకి కన్నీటి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎర్ర జెండాలు చేతబట్టి వచ్చిన మద్దతుదారులు అమెరికాకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. వారి నినాదాలతో గ్రాండ్ మొసల్లా ప్రాంగణం మార్మోగిపోతోంది. 'నా ప్రియమైన నాయకుడికి వీడ్కోలు చెప్పేందుకు వచ్చాను. ఇలాంటి రోజు వస్తుందని ఎన్నడూ ఊహించ లేదు. ఈ విషాదాన్ని చూడకముందే నేను చనిపోయి ఉంటే బాగుండేది' అంటూ ఓ యువకుడు భావోద్వేగానికి గురయ్యాడు. కాగా, రాబోయే మూడు రోజుల్లో ఒక్క టెహ్రాన్‌లోనే 1.5 నుంచి 2 కోట్ల మంది వరకు ఖమేనీ అంత్యక్రియల్లో పాల్గొనే అవకాశం ఉందని ఇరాన్ అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు ఇరాన్ పార్లమెంట్ స్పీకర్, అమెరికాతో చర్చలకు ప్రధాన ప్రతినిధిగా వ్యవహరించిన మహమ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ సహా పలువురు ప్రముఖులు ఖమేనీకి నివాళులర్పించారు. తాజా దాడుల్లో మరణించిన రివల్యూషనరీ గార్డ్స్ మాజీ చీఫ్ స్థానంలో నియమితులైన అహ్మద్ వాహిదీ కూడా అంతిమ సంస్కారాల్లో పాల్గొన్నారు. భారత్ తరఫున బిహార్ గవర్నర్ సయ్యద్ అటా హస్నైన్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గరిటా ఈ కార్యక్రమాలకు హాజరయ్యారు.

కాగా, సోమవారం వరకు ఖమేనీ పార్థివదేహాన్ని టెహ్రాన్‌లో ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. అనంతరం నగరంలో భారీ అంతిమయాత్ర నిర్వహిస్తారు. మంగళవారం నాడు పవిత్ర నగరమైన ఖోమ్‌కు, బుధవారం ఇరాక్‌లోని పవిత్ర ప్రాంతాలకు తీసుకెళ్తారు. గురువారం నాడు ఈశాన్య ఇరాన్‌లోని ఖమేనీ స్వస్థలమైన మష్హద్‌లో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

# బద్రీనాథ్ ఆలయంలో ఆర్థిక అవకతవకలు


- భైరవ సేన అనే సంస్థ ఆరోపణలు
- అంతర్గత విచారణకు ఆదేశించిన ఆలయ కమిటీ



**డెహ్రాడూన్, జులై 4 :** అయోధ్య రామ మందిరంలో విరాళాల దుర్వినియోగం ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాజాగా బద్రీనాథ్ ధామ్ లోనూ ఇలాంటి పుకార్లు జోరందుకున్నాయి. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ అంతర్గత విచారణకు ఆదేశించింది. ఈ మేరకు బీకేటీసీ ప్రెసిడెంట్ హేమంత్ ద్వివేది మాట్లాడుతూ.. 'నిధుల దుర్వినియోగం జరిగిందంటూ సామాజిక మాధ్యమాల్లో ఆరోపణలు వెల్లువెత్తున్నందున విచారణ కమిటీ ఏర్పాటుచేయాలని నిర్ణయించాం. ఈ వ్యవహారానికి సంబంధించి విధుల్లో ఉన్న ఉద్యోగుల వివరాలనూ కోరాం' అని తెలిపారు. కాగా.. బద్రీనాథ్ ఆలయంలో ఆర్థిక అవకతవకలు జరిగాయని భైరవ సేన అనే ఓ సంస్థ ఆరోపించింది. ఆలయ కమిటీ ఛైర్మన్ వ్యక్తిగత సహాయకుడికి సంబంధమున్న నిధుల దుర్వినియోగం ఆరోపణలపై పారదర్శకంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేసింది. అయితే.. దీనిపై ప్రెసిడెంట్ ద్వివేది స్పందిస్తూ.. సోషల్ మీడియాలో తన వ్యక్తిగత కార్యదర్శిగా పేర్కొన్న వ్యక్తి బీకేటీసీలో ఓ ఉద్యోగి మాత్రమేనన్నారు. ఆయన గతంలో ముగ్గురు మాజీ ఛైర్మన్ల వద్ద పనిచేశారని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయమై బీకేటీసీ ప్రధాన కార్యనిర్వాహక అధికారి సోహన్ సింగ్ రంగడ్ మాట్లాడుతూ.. 'నిధుల దుర్వినియోగం ఆరోపణలు రావడంతో వెంటనే ఆలయ ప్రాంగణంలోని సీసీటీవీ కెమెరాలను పరిశీలించాం. కానీ ఆ ఫుటేజీ స్పష్టంగా లేకపోవడంతో పూర్తివివరాలు తెలియరాలేదు. అయినప్పటికీ ఈ విషయం అత్యంత సున్నితమైనదిగా భావించి, ఛైర్మన్‌కు నివేదించాం' అని చెప్పారు. ఛైర్మన్ ఆదేశాలతో సదరు ఉద్యోగుల వివరాలు సేకరించడం సహా వారిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టేందుకు అంతర్గత కమిటీని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించామన్నారు. విచారణలో ఎవరైనా తప్పుచేసినట్లు రుజువైతే.. వారిపై బీకేటీసీ చట్టం-1939, ఉద్యోగుల ప్రవర్తనా నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఈ అంశం కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి సంబంధించినది కావడంతో నిరాధార ఆరోపణలు, తప్పుదోవ పట్టించే ప్రచారాలకు ప్రజలు దూరంగా ఉండాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.

# పార్లమెంట్ వర్షాకాల షెడ్యూల్ ఖరారు

- జూలై20 నుంచి ఆగస్ట్ 13 వరకు సమావేశాలు
- ఎక్స్ వేదికగా వెల్లడించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు



**న్యూఢిల్లీ, జులై 4 :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల షెడ్యూల్ ఖరారయ్యింది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోషల్ మీడియా ఎక్స్‌లో పేర్కొన్నారు. జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు సమావేశాలు జరగనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సిఫారసు మేరకు పార్లమెంట్ 2026 వర్షాకాల సమావేశాలను నిర్వహించేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. దేశ ప్రాధాన్యత కలిగిన కీలక అంశాలపై అర్థవంతమైన చర్చలు, సమగ్ర చర్చోపచర్చలు, నిర్ణయాలు తీసుకునేందుకు ఈ సమావేశాలు వేదిక కానున్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇక ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశముండగా దేశ ఆర్థిక వ్యవస్థ, జాతీయ భద్రత, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమం, ఇతర సమకాలీన అంశాలపై కూడా ఇరు సభల్లో విస్తృతంగా చర్చలు జరిగే అవకాశం ఉంది. అలాగే ప్రతిపక్ష పార్టీలు కూడా వివిధ ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించే అవకాశముంది. ఇటీవలి పరిణామాలు, దేశీయ, అంతర్జాతీయ అంశాలతో పాటు పలు రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలను కూడా ప్రతిపక్ష పార్టీలు ఈ సమావేశాల్లో ప్రస్తావించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం కూడా తన కీలక విధానాలు, సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను సభ ముందుకు తీసుకురానుంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు ముగియనున్న ఈ సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలు, చర్చలు జరిగే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వర్షాకాల సమావేశాల్లో ఎన్డీఏ ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా రెండు రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకురానున్నట్లు తెలుస్తోంది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజనను సవరణలతో మళ్లీ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ బిల్లులో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల సభ్యుల సంఖ్యను 50 శాతం పెంచే ప్రతిపాదన కూడా ఉండొచ్చని సమాచారం. ఇక ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీయడానికి సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం, అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, నిరుద్యోగ సమస్య వంటి అంశాలపై కేంద్రాన్ని ఇరుకున పెట్టేందుకు వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఈసారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు హాట్ హాట్‌గా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

# ఉగ్రవాదంపై ఉక్కుపాదం..

## 23 మందిని టెర్రరిస్ట్‌లుగా ప్రకటించిన కేంద్రం

**న్యూఢిల్లీ :** సీమాంతర ఉగ్రవాదంపై కేంద్రం ఉక్కుపాదం మోపుతోంది. దానిలో భాగంగా పాకిస్థాన్ కేంద్రంగా నడుస్తోన్న జైషే మహమ్మద్, లష్కరే తయ్యిబా, అనుబంధ ఉగ్రసంస్థలకు చెందిన 23 మంది ఆపరేటివ్స్‌ను ఉగ్రవాదులుగా ప్రకటించింది. చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద వారిని ఉగ్రవాదులుగా పరిగణించినట్లు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ శనివారం నోటిఫై చేసింది. జమ్మూకశ్మీర్‌లో దాడులకు ప్రణాళికలు, డ్రోన్లతో ఆయుధాల సరఫరా, చొరబాట్లు, టెర్రర్ రిక్రూట్‌మెంట్ వంటి వాటిల్లో వారికి ప్రమేయం ఉందని పేర్కొంది. ఉపా చట్టం ప్రకారం.. ఒక వ్యక్తికి ఉగ్రవాద కార్యకలపాల్లో ప్రమేయం ఉందని భావిస్తే, వారిని ఉగ్రవాదిగా ప్రకటించే అధికారం కేంద్రానికి ఉంది. దాంతో వారి లావాదేవీలను నిలిపివేయడానికి, ఆస్తులను జప్తు చేయడానికి జాతీయ దర్యాప్తు సంస్థకు వీలు కలుగుతుంది. 2019లో చేసిన సవరణలతో వ్యక్తులను ఉగ్రవాదులుగా ప్రకటించడానికి అవకాశం ఏర్పడింది. అందుకు ముందు గ్రూప్‌లను మాత్రమే ఉగ్రవాద సంస్థల జాబితాలో చేర్చేవారు. కాగా, ఈ 23 మందితో కలిపి ప్రకటిత ఉగ్రవాదుల సంఖ్య 80కి చేరింది.

## ఇరాక్ ఎంపి అవినీతి బట్టబయలు

**బంగారంతో లోదుస్తుల తయారీ**

**బాగ్దాద్, జులై 4 :** బాత్‌రూమ్‌లోని కమోడ్‌లను కూడా కొందరు సంపన్నులు బంగారంతో తయారు చేసుకున్న ఉదంతాలు మనకు తెలుసు. కానీ ఇరాక్‌లోని ఒక ఎంపీ ఇంటిపై దాడి చేసిన అవినీతి నిరోధక శాఖ అధికారులు విలువైన వజ్రాలు, బంగారం, కట్టల కట్టల డబ్బు, ఖరీదైన వస్తువులు చూసి ఆశ్చర్య పోలేదు కానీ, బంగారంతో తయారు చేసిన ఖరీదైన లో దుస్తుల జతను చూసి షాక్ తిన్నారు. దీంతో ఈ బికినీ జత సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారింది. తీవ్ర అవినీతి ఆరోపణలు ఉన్న ఈ మహిళా ఎంపీ అలియా నస్సీఫ్ ఇంటి నుంచి అధికారులు 1.33 కోట్ల డాలర్లు అంటే సుమారు రూ. 148 కోట్లు నగదు, బంగారం, నగలు, వజ్రాలు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. భవనాలు, ఇతర ఆస్తులను కూడా ఆధీనంలోకి తీసుకున్నారు. మొత్తం పట్టుబడిన అక్రమ ఆస్తుల విలువ 8.5 కోట్ల డాలర్లు సుమారు రూ. 809 కోట్లు ఉంటుందని చెప్పారు.

## బావిలో పడ్డ ఎద్దును రక్షించబోయి ముగ్గురు దుర్మరణం

**భోపాల్, జులై 4 :** బావిలో పడిన ఎద్దును రక్షించబోయి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటన మధ్యప్రదేశ్ లోని సత్నా జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖరమ్‌సేడ గ్రామంలో శుక్రవారం రాత్రి 8.30 గంటల సమయంలో ఓ ఎద్దు ప్రమాదవశాత్తు బావిలో పడింది. దానిని రక్షించడానికి ఇద్దరు వ్యక్తులు తాడు సాయంతో 40 అడుగుల బావిలోకి దిగారు. వారి నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో మరో ఇద్దరు బావిలోకి దిగారు. కొన్ని నిమిషాల తర్వాత వారు కూడా తిరిగిరాలేదు. దీంతో లోపల ఏదో ప్రమాదం పొంచి ఉందని గుర్తించిన స్థానికులు తాళ్లు, కొక్కాల సాయంతో 3 గంటల పాటు శ్రమించి నలుగురిని బయటకు తీశారు. వెంటనే వారిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే ముగ్గురు ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. మృతులను ఒకే కుటుంబానికి చెందిన రాహుల్ యాదవ్ (36), వీరేంద్ర యాదవ్ (40), కృష్ణదత్ యాదవ్ (26)గా గుర్తించారు. చాలాకాలం పాటు బావి మూసి ఉండడంతో భారీగా చెత్త పేరుకుపోయిందని.. విషవాయువులు వెలువడి అందులోకి దిగినవారు మృతిచెందినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు వెల్లడించారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామన్నారు.



## తొలిరోజు మంచులింగం దర్శించుకున్న 12 వేల మంది భక్తులు

**జమ్ము, జులై 4 :** కట్టుదిట్టమైన భద్రత... వాతావరణ అవాంతరాల మధ్య ... హర హర మహాదేవ్ అంటూ... బయల్దేరిన భక్తులకు ఈ ఏడాది అమరనాథ్ మంచుశివలింగ తొలి దర్శనమైంది. అమరనాథ్‌యాత్రలో భాగంగా శుక్రవారం తొలిరోజు 12 వేల మంది భక్తులు మంచులింగాన్ని దర్శించుకున్నారు. జమ్మూకశ్మీర్‌లోని హిమాలయాల్లో ఏటా ఈ సమయంలో ఏర్పడే మంచు లింగాన్ని పూజించేందుకు గురు, శుక్రవారాల్లో నువ్వాన్, బాల్‌టాల్ బేస్ క్యాంపుల నుంచి రెండు బృందాలు బయలుదేరాయి. శుక్రవారం దర్శనం చేసుకున్నవారిలో 9,350 మంది పురుషులు, 2,250 మంది మహిళలు, 200 మంది పిల్లలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.



## రైతుల హక్కుల కోసం పోరాడిన యోధుడు దొడ్డి కొమురయ్య

- ఝాన్సీ రాణి - జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్
- మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా దొడ్డికొమరయ్య వర్ధంతి
- నివాళి అర్పించిన డి.ఆర్. ఓ మాలతి, ఇతర అధికారులు

**మేడ్చల్ :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో, ఈ నెల 4న ఉదయం 11గంటలకు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో డి.ఆర్.ఓ ఎస్.మాలతి, జ్యోతి ప్రజ్వలచేసి, దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఝాన్సీ రాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాంబశివరావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి సీతారాములు, సహాయ వెనుకబడిన శాఖ అధికారి బి. రవీందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. దొడ్డి కొమురయ్య సేవలను కొనియాడారు. జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి ఝాన్సీ రాణి మాట్లాడుతూ, దొడ్డి కొమురయ్య రైతుల హక్కుల కోసం పోరాడి, భూస్వాముల చేతుల్లో నెలకొరిగాడన్నారు. 1946లో జరిగిన తెలంగాణ రైతాంగ పోరాటంలో ఆయన కీలక పాత్ర పోషించారని, అన్యాయానికి వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం మనందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ కార్యక్రమములో గొంగల్ల తిరుపతి వెంకటేష్ - ( ప్రధాన కార్యదర్శి, కురుమ సంఘం, మేడ్చల్-మల్కాజిరి జిల్లా), దయ్యాల గట్టయ్య - (ఉపాధ్యక్షులు), జి.బాలేశ్, పి. విగ్నేష్ సి.గోపాల్ అలాగే కురుమ సంఘం సభ్యులు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులు

**సికింద్రాబాద్ :** న్యూ బోయినపల్లి స్వామి వివేకానంద సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బోయినపల్లి ప్లే గ్రౌండ్ వద్ద శనివారం మన్యం వీరుడు అల్లూరి సీతారా మరాజు 129వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ, సాయుధ పోరాటం ద్వారానే దేశానికి స్వాతంత్ర్యం సాధ్యమని విశ్వసించి ఆంగ్లేయ పాలకులను గడగడలాడించిన మహావీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. చిన్న వయస్సులోనే దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను అర్పించి యువతకు స్ఫూర్తిగా నిలిచిన మహనీయుడని పేర్కొన్నారు. అల్లూరి ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్వామి వివేకానంద సంక్షేమ సంఘం అధ్యక్షులు మద్ది భాస్కర్ రెడ్డి, కార్యదర్శి శశిరాజు యాదవ్, జ్ఞాన్ ప్రకాష్, వాసు గౌడ్, సాయిబాబా యాదవ్, సురేష్, యాదగిరి, జంపన రవి, బండి శ్రీను, ముకేశ్ యాదవ్, వరప్రసాద్, కృష్ణ, టెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## కృషాంక్ వ్యాఖ్యలపై భానుక మల్లికార్జున్ తీవ్ర ఆగ్రహం

**అసత్య ఆరోపణలపై పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరిక**



**సికింద్రాబాద్ :** కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్‌పై బీఆర్ఎస్ నేత కృషాంక్ చేసిన వ్యాఖ్యలను కంటోన్మెంట్ బీజేపీ నాయకుడు భానుక మల్లికార్జున్ తీవ్రంగా ఖండించారు. రత్నా సొసైటీ లేఔట్‌కు సంబంధించిన అంశం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉన్నప్పటికీ, పూర్తి అవగాహన లేకుండా కృషాంక్ వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. తమపై చేసిన ఆరోపణలు పూర్తిగా అసత్యమని, వాటిపై కృషాంక్‌పై పరువు నష్టం దావా వేస్తామని ఆయన హెచ్చరించారు. ఇటీవల బీజేపీ నుంచి బహిష్కరణకు గురైన ఓ నాయకుడి సూచనల మేరకే కృషాంక్ మాట్లాడుతున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. నామినేటెడ్ సభ్యురాలిగా భానుక నర్మద అనర్హురాలని చెప్పడం చట్టపరంగా, రాజకీయపరంగా ఎంతవరకు సమంజసమో కృషాంక్ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. నర్మద రాజీనామా చేస్తే ఎన్నికలు ఎలా వస్తాయో కూడా ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. కంటోన్మెంట్ ప్రాంత అభివృద్ధి కోసం తమ కుటుంబం నిరంతరం ప్రజాసేవలో ఉందని, వ్యక్తిగత కక్షతో చేస్తున్న విమర్శలు తగవని భానుక మల్లికార్జున్ అన్నారు. కంటోన్మెంట్ వ్యవస్థ, చట్టాలు, రాజకీయాలపై పూర్తి అవగాహనతోనే ప్రజాప్రతినిధులపై వ్యాఖ్యలు చేయాలని ఆయన సూచించారు.



## దొడ్డి కొమరయ్య త్యాగస్ఫూర్తి చిరస్మరణీయం

**వర్ధంతిలో మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ నివాళి**

**సికింద్రాబాద్ :** హస్మత్‌పేట్ చెరువు కట్ట వద్ద కురుమ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి కార్యక్రమంలో ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ పాల్గొని దొడ్డి కొమరయ్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముద్దం నర్సింహ యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం దొడ్డి కొమరయ్య చేసిన త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఆయన చూపిన పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో దొడ్డి కొమరయ్య పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ ఎజాజ్, డివిజన్ అధ్యక్షులు ఇర్ఫాన్, డివిజన్ కార్యదర్శి హరినాథ్, ఐలేష్, పోచయ్య, మక్కల సత్యనారాయణ, బాలరాజ్ గుప్తా, శ్రీనివాస్ రెడ్డి, అశోక్, వాసు, ఖదీర్ భాయ్, షర్ఫు సోఫీ, రాజు గౌడ్, కృష్ణారెడ్డి, మోహన్, డాక్టర్ సుధాకర్, దుబాయ్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ, అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబులి
- అధికారులు బాధ్యత, పారదర్శకతతో పని చేయాలి
- ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అధికారులు,
- ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలిలి
- ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పై శ్వేతపత్రం సిద్ధం చేయాలి
- యూరియా బుకింగ్ యాప్ రాష్ట్రానికి ఆదర్శం.. ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలిలి
- అభివృద్ధి పనులు, భూసేకరణను నిర్ణీత గడువులో పూర్తి చేయాలి
- సన్న వడ్లు సాగు చేసి బోనస్ పొందాలిలి
- ధాన్యం కొనుగోలు, ఇందిరమ్మ ఇండ్లు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల్లో గణనీయమైన పురోగతిలి
- జిల్లా అభివృద్ధిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి శ్రీధర్ బాబులి




**పెద్దపల్లి, జూలై -04:** సంక్షేమ, అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రోటోకాల్, ప్రజా సంబంధాల ప్రభుత్వ సలహాదారు హర్కర వేణు గోపాల్ , ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు ,జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష,రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ లతో కలిసి పెద్దపెల్లి జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖ, ఇరిగేషన్,పంచాయతీరాజ్,పట్టణాభివృద్ధి, ఇందిరమ్మ ఇండ్లు,వైద్య శాఖ, విద్యా శాఖ, ఎస్సి, టీసి, మైనారిటీ సంక్షేమ శాఖ, పరిశ్రమల, రెవెన్యూ శాఖ, వి.బి.జి రామ్ జి,త్రాగునీటి సరఫరా,విద్యుత్ సరఫరా , అటవీ శాఖ పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతి పై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వానికి ఇంకా రెండున్నర సంవత్సరాలకు పైగా పదవీకాలం ఉందని, ఈ కాలంలో ప్రతి అధికారి మరింత బాధ్యత,పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు చేరువ చేయాలని మంత్రి అన్నారు. ప్రజలకు సమయం కేటాయించి వారి సమస్యలను ఓపికగా వినాలని,మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఎలాంటి విసుగు లేకుండా ప్రతి దరఖాస్తును పరిశీలించాలని సూచించారు. దరఖాస్తుల్లో లోపాలు ఉంటే లేదా ఏదైనా పని ఆలస్యం అవుతుంటే దానికి గల కారణాలను ప్రజలకు స్పష్టంగా, వారికి అర్థమయ్యే విధంగా వివరించాలని ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతాయని పేర్కొన్నారు. చిన్న సమస్య అయినా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుందని తెలిపారు. తెలిసి ఎలాంటి తప్పిదాలు చేయకుండా ప్రతి అధికారి అత్యంత బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై జిల్లా స్థాయిలో సమగ్ర శ్వేతపత్రం (వైట్ పేపర్) సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదు, సూచన, అభిప్రాయం ప్రభుత్వానికి చేరేలా చర్యలు తీసుకోవాలని, వాటి ఆధారంగా లోపాలు, పెండింగ్ అంశాలు, బ్యాక్‌లాగ్‌లను గుర్తించి వెంటనే సరిదిద్దే కార్యాచరణ చేపట్టాలని సూచించారు. పెద్దపల్లి జిల్లా పరిపాలన, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష నాయకత్వంలో అధికారులు సమర్థవంతంగా పనిచేస్తున్నారని అభినందించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు, ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సేవల మెరుగుదల, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు వంటి రంగాల్లో మంచి ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు. రైతుల కోసం పెద్దపల్లి జిల్లాలో ప్రారంభించిన యూరియా బుకింగ్ యాప్ రాష్ట్రానికే కాకుండా దేశానికి కూడా ఆదర్శంగా నిలిచిందని మంత్రి అన్నారు. జిల్లాలో ప్రతి అర్హ రైతుకు అవసరమైన సమయంలో యూరియా తప్పనిసరిగా అందేలా చూడాలని,అవసరం లేని వారికి యూరియా పంపిణీ జరగకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగువైపు ప్రోత్సహించాలని, ముఖ్యంగా ఆయిల్ పామ్, కూరగాయలు,పప్పుధాన్యాలు వంటి పంటల సాగును విస్తరించేలా వ్యవసాయ శాఖ కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించిన ఏడు రకాల వరి వంగడాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని, ప్రతి మండలంలోని రైతు వేదికల్లో ఆ ఏడు రకాల విత్తనాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో విజయవంతంగా నిర్వహించిన విత్తన మేళా తరహాలో రైతులకు నాణ్యమైన విత్తనాలపై అవగాహన కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. వ్యవసాయ అధికారులు రైతులతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ క్షేత్రస్థాయిలో పంటలను పర్యవేక్షించాలని, రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు అందించాలని తెలిపారు. అనధికారిక, నాణ్యతలేని విత్తనాల వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని స్పష్టం చేశారు. జిల్లాలో చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణను ప్రాధాన్యత క్రమంలో వేగవంతం చేయాలని, భూసేకరణ ప్రక్రియలో రైతులు, స్థానిక ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ పారదర్శకంగా ముందుకు సాగాలని సూచించారు. సమీక్ష సమావేశానికి ముందు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ-రమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ ఉద్యమ అమరవీరులు దొడ్డి కొమురయ్య, మాజీ ముఖ్యమంత్రి రోశయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" పుస్తకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు కలెక్టరేట్ ఆవరణలో నూతన అంబులెన్స్‌ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించి, ప్రజలకు మరింత మెరుగైన అత్యవసర వైద్య సేవలు అందించే దిశగా ఈ అంబులెన్స్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, ఆర్ డి వో లు సురేష్, గంగయ్య, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఎ. అన్నయ్య గౌడ్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్. మల్లయ్య,జిల్లా అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నృత్య దేవ అర్చన వార్షికోత్సవం

**కన్నులకు ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన**

**శేరిలింగంపల్లి, జూలై 04 (జనం వార్త) :** భారతీయ శాస్త్రీయ నృత్య సంప్రదాయాలను పరిరక్షిస్తూ,యువ కళాకారులకు ప్రోత్సాహం అందించే లక్ష్యంతో డొయన్స్ కాలనీలోని శ్రీ నారాయణి నాట్యాలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో "నృత్య దేవ అర్చన"రెండవ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో పలువురు యువ కళాకారులు తమ అద్భుత ప్రతిభను ప్రదర్శించారు. మహతి భిక్షూ కూచిపూడి నృత్య ప్రదర్శనతో ప్రేక్షకులను ఆకట్టుకోగా,సబర్నిక్ డీ ఒడిస్సీ నృత్య రూపకంతో భారతీయ శాస్త్రీయ నృత్య వైభవాన్ని చాటిచెప్పారు. వారి ప్రదర్శనలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా శ్రీ నారాయణి నాట్యాలయ వ్యవస్థాపకుడు, ప్రముఖ భరతనాట్య గురువు సంతోష్ కుమార్ తమాంగ్ మాట్లాడుతూ భారతీయ శాస్త్రీయ నృత్య కళల అసలైన సంప్రదాయాన్ని భావితరాలకు అందించడంతో పాటు యువ కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించుకునే వేదికగా 'నృత్య దేవ అర్చన'ను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల ప్రతిభావంతులైన కళాకారులకు మరిన్ని ప్రదర్శన అవకాశాలు కల్పించేందుకు ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాభిమానులు, నృత్య



గురువులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళాకారులను అభినందించారు.



## తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి ప్రదాత దొడ్డి కొమురయ్య

**దేవరుప్పుల :** దేవరుప్పుల మండలంలోని పెద్దమడూరు గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కురుమ సంఘం పెద్ద కురుమ కర్రే రాజు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అసువులు బాసిన మొట్టమొదటి అమరుడు దొడ్డి కొమురయ్య అని గుర్తుచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కర్రే కృష్ణ, నర్సింహ, రామనర్సయ్య, బీరయ్య, సోమయ్య, నర్సయ్య, ఒగ్గు కళాకారులు శీలం బీరయ్య, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.



## చెత్త కుప్ప బాబోయ్ చెత్త

- ప్రశాంతినగర్‌లో ఎక్కడ చూసినా చెత్తకుప్పల దర్శనం
- చెత్త దుర్వాసనతో అనారోగ్య ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు
- పట్టించుకోని అధికారులు, నాయకులు

**శేరిలింగంపల్లి, జూలై 04 (జనం వార్త) :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రశాంతినగర్ కాలనీలోని సెయింట్ జేవియర్స్ ప్రైవేట్ పాఠశాల సమీపంలో పేరుకుపోయిన చెత్తకుప్ప స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. రోజు విడిచి రోజు చెత్త సేకరణ వాహనం వస్తున్నప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు సుమారు 50 అడుగుల దూరంలోనే చెత్త పేరుకుపోవడంతో దుర్వాసనలు వెదజల్లుతూ విద్యార్థులు, స్థానికులు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నా రని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అలాగే రోడ్డుపై వెళ్తున్న బాటసార్లు కూడా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో చెత్తకుప్ప వల్ల దోమలు,ఈగలు పెరిగి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి చెత్తను పూర్తిగా తొలగించడంతో పాటు,మళ్లీ అక్కడ చెత్త వేయకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



## బోయిన్‌పల్లిలో ఘనంగా ప్రారంభమైన బీఎంఎస్ విటాలిటీ వెల్‌నెస్ సెంటర్

**సికింద్రాబాద్ :** బోయిన్‌పల్లి బాపుజి నగర్ సమీపంలోని స్టార్ బజార్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన బీఎంఎస్ విటాలిటీ వెల్‌నెస్ సెంటర్ను బీఎంఎస్ ఫౌండర్ అను చెల్లయ్య ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి, అనంతరం వెల్‌నెస్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ప్రపంచంలోని అనేక దేశాల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా బరువు నియంత్రణ, శరీర దృఢత్వం, జీవనశైలి కారణంగా వచ్చే పలు సమస్యలను పరిష్కారంకి నిపుణుల మార్గదర్శకత్వంలో వెల్‌నెస్ ప్రోగ్రా మ్‌లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో బీఎంఎస్ వెల్‌నెస్‌కు ఇప్పటికే సుమారు 60 బ్రాంచీలు ఉన్నాయని, ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత ఆరోగ్య లక్ష్యాలకు అనుగుణంగా కోచ్‌ల సహకారంతో సేవలు అందిస్తున్నామని తెలిపారు. వెల్‌నెస్ సేవలు, సభ్యత్వం లేదా ఇతర వివరాల కోసం ఆసక్తి గల వారు కల్పన - 99666 54307, సఫలత - 94418 67142 నంబర్లను సంప్రదించవ చ్చని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వెల్‌నెస్ కోచ్‌లు, సభ్యులు, స్థానిక ప్రముఖులు, మహిళలు పాల్గొని నూతన కేంద్రం ప్రారంభోత్సవానికి శుభాకాంక్షలు తెలిపారు.



## పాపికొండల యాత్ర
# మళ్లీ ప్రారంభం

**రాజమండ్రి, భద్రాచలం నుంచి యథావిధిగా యాత్ర**

**రాజమండ్రి, జూలై 4 :** భద్రతా కారణాల దృష్ట్యా గత జూన్ చివరి వారంలో తాత్కాలికంగా నిలిచిపోయిన ప్రపంచ ప్రసిద్ధ పాపికొండలు బోటింగ్ విహారయాత్రకు ఎట్టకేలకు అధికారులు మళ్లీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గోదావరి నది ఉధృతి తగ్గుముఖం పట్టడం, పర్యాటక బోట్ల ఫిట్‌నెస్ మరియు భద్రతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ యాత్రను అటు రాజమండ్రి పుష్కర ఘాట్ నుండి, ఇటు భద్రాచలం నుండి పర్యాటకుల సౌకర్యార్థం అందుబాటులోకి తెచ్చారు. ప్రకృతి ప్రేమికులకు, కుటుంబ సమేతంగా ఆహ్లాదకరమైన సమయాన్ని గడపాలనుకునే వారికి ఇది ఒక గొప్ప అవకాశం. గోదావరి జలవిహారంలో పర్యాటకులకు ఆధ్యాత్మికతతో పాటు ప్రకృతి అందాలను వీక్షించే అద్భుతమైన అవకాశం లభిస్తుంది. ఈ టూర్ ప్యాకేజీలో భాగంగా గండిపోచమ్మ ఆలయం, సుందరమైన పాపికొండలు, మరియు ప్రశాంతమైన పేరంటాలపల్లి ఆశ్రమం వరకు బోటింగ్ ప్రయాణం సాగుతుంది. ప్రయాణీకుల భద్రతకు పెద్దపీట వేస్తూ లైఫ్ జాకెట్లు మరియు అనుభవజ్ఞులైన సిబ్బందిని బోట్లలో అందుబాటులో ఉంచారు. ఇక టికెట్ ధరల విషయానికి వస్తే? పెద్దలకు రూ. 1250, మరియు 5 నుండి 10 సంవత్సరాల లోపు పిల్లలకు రూ. 1050 గా నిర్ణయించారు. చాలా కాలం తర్వాత బోటింగ్ పునఃప్రారంభం కావడంతో పర్యాటక రంగం మళ్లీ కళకళలాడనుంది.

## సాయికృష్ణ కేసులో మెజిస్టీరియల్ విచారణ

- విచారణకు హాజరైన తల్లీ, కుటుంబీకులు
- సిఐ నాగరాజు తన కొడుకును మాయం చేశాడన్న తల్లి



**విజయవాడ, జులై 4 :** గాదె సాయికృష్ణ కేసుకు సంబంధించి మెజిస్టీరియల్ విచారణ కొనసాగుతోంది. విజయవాడలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన విచారణకు సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి, మేనమామ నాగేశ్వర రావు, మేనత్త శనివారం హాజరై తమ వాంగ్మూలాలను నమోదు చేశారు. ఈ కేసు విచారణ సందర్భంగా పోలీసుల పై విజయలక్ష్మి సంచలన ఆరోపణలు చేశారు. తన కుమారుడు సాయికృష్ణను పోలీసులే చంపేసి, అనంతరం మృతదేహాన్ని మాయం చేశారని ఆరోపించారు. కృష్ణలంక పోలీసుస్టేషన్‌లో తన కుమారుడు ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లామని తెలిపారు. అయితే, అప్పటి సీఐ నాగరాజు తన కుమారుడిని చూపకుండా వెనక్కి పంపించారని ఆమె వెల్లడించారు. ఈ కేసులో తమ కుటుంబానికి న్యాయం చేయాలని విచారణాధికారిని విజయలక్ష్మి వేడుకున్నారు. దాదాపు రెండు గంటలకు పైగా మెజిస్టీరియల్ విచారణ కొనసాగింది. ఈ కేసులో పూర్తి నిజాలు వెలుగులోకి రావాలంటే సమగ్ర, నిష్పాక్షిక విచారణ అవసరమని డిమాండ్ చేశారు. ఈ కేసు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారగా, మేజిస్ట్రేట్ విచారణలో వెలుగులోకి వచ్చే అంశాలు కీలకంగా మారనున్నాయి.

## బ్రిటిష్ వారిని ఎదిరించిన మన్యం వీరుడు

**అల్లూరి జయంతి సందర్భంగా పవన్ నివాళి**

**అమరావతి, జులై 4 :** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఘన నివాళులు అర్పించారు. వీర యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా, ఆ స్వాతంత్య సమరయోధుడికి ప్రగాఢ నివాళులు అర్పిస్తున్నానని తెలిపారు. స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలనను ధైర్యంగా ఎదిరించి, గిరిజన ప్రజల హక్కులు, గౌరవం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పోస్టు పెట్టారు. స్వాతంత్య పోరాట చరిత్రలో అల్లూరి సీతారామరాజు చిరస్థాయిగా నిలిచిపోయారని పవన్ కల్యాణ్ ప్రశంసించారు. ఆయన పోరాటం కేవలం ఒక ఉద్యమం మాత్రమే కాదని చెప్పారు. ధైర్యం, త్యాగం, దేశభక్తిని ఎన్నటికీ మరిచిపోలేమని అన్నారు. అల్లూరి ఆశయాలే దేశానికి మార్గదర్శకమని వ్యాఖ్యానించారు. స్వాతంత్యాన్ని కాపాడాలంటే బాధ్యతతో జీవించాలని... దేశాన్ని బలోపేతం చేయాలంటే సేవాభావంతో ముందుకు సాగాలని... సమాజం కోసం నిలబడటమే నిజమైన దేశభక్తి అని అల్లూరి సీతారామరాజు జీవితం మనకు నేర్పుతుందని చెప్పుకొచ్చారు.

## ధైర్యసాహసాలకు నిలువుటద్దం అల్లూరి

**నివాళి అర్పించిన టిడిపి అధ్యక్షుడు పల్లా**

**విశాఖపట్నం,జులై4 :** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగం, ధైర్యసాహసాలు, దేశభక్తి భావం భావితరాలకు స్ఫూర్తిదాయకమని తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కొనియాడారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాడి బ్రిటిష్ పాలనకు సవాల్ విసిరిన మహావీరుడిగా అల్లూరి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని వ్యాఖ్యానించారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా శనివారం గాజువాకలోని ఆయన విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. అల్లూరి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని దేశ, సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అలాగే, గాజువాకలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఘన నివాళులు అర్పించారు. యువతలో ఆత్మవిశ్వాసం, దేశభక్తి, సేవాభావాన్ని పెంపొందించిన మహనీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. వివేకానంద చూపిన మార్గం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. యువత వివేకానంద ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి తమ వంతుగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా పల్లా శ్రీనివాసరావు ఘన నివాళులు అర్పించారు. నిజాయితీ, నిరాడంబరత, ఆర్థిక క్రమశిక్షణతో కూడిన రాజకీయాలకు రోశయ్య ఆదర్శప్రాయమని కొనియాడారు.

# సంజీవనిలో డేటా ఇంటిగ్రేషన్ కీలకం

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం
- కుప్పం ప్రభుత్వ ఆస్పత్రిలో సీటీ స్కాన్, డయాలసిస్ సేవల్ని ప్రారంభించిన సీఎం
- డ్రగ్స్, గంజాయిపై మరింత కఠినంగా ఉండాలని పోలీసులకు ఆదేశం
- పంచతత్వ కాన్సెప్టుతో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ పరిశీలించిన సీఎం చంద్రబాబు



**కుప్పం, జూలై 4 :** సంజీవని కార్యక్రమంలో డేటా అనుసంధానమే కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్ నుంచి ఆస్పత్రి పరిశుభ్రత వరకు ప్రతీ అంశంపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కుప్పం నియోజకవర్గ పర్యటన రెండో రోజు కుప్పం ప్రాంతీయ ఆస్పత్రిలో సీటీ స్కాన్, డయాలసిస్ కేంద్రాలను ప్రారంభించి సేవలను పరిశీలించారు. సంజీవని ప్రాజెక్టు అమలు, వైద్యారోగ్య రంగంలోని ఆవిష్కరణలు, డ్రగ్స్ నివారణ చర్యలపై అధికారులతో మాట్లాడారు. డిజిటలైజేషన్ తో పాటు డేటా ఇంటిగ్రేషన్ అవసరంకుప్పం ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సీటీ స్కాన్, డయాలసిస్ సెంటర్లను ముఖ్యమంత్రి ప్రారంభించారు. సీటీ స్కాన్ ద్వారా రోజుకు ఎంత మందికి సేవలు అందించగలరని సీఎం ప్రశ్నించారు. రోజుకు 30?40 మందికి పరీక్షలు చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆస్పత్రిని పరిశీలన సందర్భంగా ఆవరణలో కొంత మేర చెత్త కనిపించడంపై ప్రశ్నించిన ముఖ్యమంత్రి, వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంజీవని కార్యక్రమంలో డేటా అనుసంధానమే ముఖ్యమని పేర్కొన్నారు. హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేయడంతోపాటు ప్రతి అంశంలోనూ డేటా ఇంటిగ్రేషన్ చేయాలని సూచించారు. డయాలసిస్ వార్డును సందర్శించిన సందర్భంగా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా కుప్పం ఏరియా ఆస్పత్రికి డయాలసిస్ నిమిత్తం వస్తున్నారని అధికారులు వివరించారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రజలు సంతృప్తి చెందాలని, కుప్పంలో ప్రజలకు ఏ మేరకు మేలు కలిగిందో వివరాలను సిద్ధం చేయాలని ఆదేశించారు.గంజాయి నియంత్రణపై కఠిన చర్యలుపంచతత్వ కాన్సెప్టుతో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించిన సీఎం చంద్రబాబు అక్కడ మొక్క నాటారు. వైద్యారోగ్య రంగంలో వివిధ ఆవిష్కరణలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో వైద్యులకు తక్షణ సమాచారం అందించేలా ఓ పరికరం రూపొందించిన విద్యార్థిని సీఎం అభినందించారు. గంజాయి, డ్రగ్స్ బారిన పడ్డవారికి మెడిటేషన్ ద్వారా ఆరోగ్యం మెరుగయ్యేందుకు సహకారం అందిస్తున్నట్టు బ్రహ్మకుమారీలు వివరించారు. డ్రగ్స్, గంజాయి వంటి వాటిని నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కుప్పం నగరంలో ఏర్పాటు చేసిన స్వర్ణ కుప్పం?స్వచ్ఛ కుప్పం స్వాగత ఆర్చ్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖమంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి ఆదర్శంగా నలగంపల్లి నెట్‌జీరో విధానం

**కుప్పం అంతటా అమలుకు సీఎం ఆదేశం**

**కుప్పం, జూలై 4 :** నెట్‌జీరో విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న నలగంపల్లి గ్రామాన్ని రాష్ట్రానికి ఆదర్శంగా నిలబెట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. కుప్పం పర్యటన రెండో రోజు శనివారం నలగంపల్లిలోని నెట్ జీరో విధానాన్ని అమలు చేస్తోన్న ఇళ్లను సందర్శించిన ముఖ్యమంత్రి....సోలార్ రూఫ్‌టాప్ సోలార్, ఇండక్షన్ కుక్‌టాప్‌లు, వర్షపు నీటి సంరక్షణ, కిచెన్ కంపోస్టింగ్, టెర్రస్ గార్డెనింగ్ వంటి విధానాలను పరిశీలించారు. నలగంపల్లి నమూనాను కేస్ స్టడీగా తీసుకుని కుప్పం వ్యాప్తంగా నెట్‌జీరో విధానాన్ని విస్తరించాలని అధికారులను ఆదేశించారు.సర్క్యులర్ ఎకానమీని గ్రామస్థాయిలో అమలు గ్రామంలోని ఓ ఇంటిని సందర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు... సోలార్ ప్యానెళ్ల సంఖ్య, విద్యుత్ ఉత్పత్తి, ఇంటి అవసరాలకు సరిపోతుందా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. సోలార్ విద్యుత్‌తో ఇండక్షన్ స్టవ్‌లను ఉపయోగిస్తూ నెలకు సుమారు రూ.400 వరకు ఆదా చేస్తున్నామని లబ్ధిదారులు వివరించారు. వర్షపు నీటి సంరక్షణ, కిచెన్ కంపోస్ట్ ద్వారా వ్యర్థాల నిర్వహణ, కిచెన్ గార్డెన్, టెర్రస్ గార్డెన్ నిర్వహణను కూడా సీఎం పరిశీలించారు. నెట్‌జీరో విధానంలో భాగంగా ఈవీ వాహనాల వినియోగాన్ని కూడా చేర్చాలని ముఖ్యమంత్రి సూచించారు. సర్క్యులర్ ఎకానమీని గ్రామస్థాయిలో అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నలగంపల్లి అనుసరిస్తున్న విధానం రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.ఇండక్షన్‌తో భద్రత ఇండక్షన్ స్టవ్‌లతో ప్రస్తుతం అన్ని రకాల వంటలు చేసుకునే సాంకేతికత అందుబాటులోకి వచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికే ఇండక్షన్ స్టవ్‌లను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. గ్యాస్ లీకేజీ ప్రమాదాలు తగ్గడంతో పాటు భద్రత పెరుగుతుందని గ్రామస్థులు సీఎంకు వివరించారు.

## మన్యంవీరుడు అల్లూరికి ఘన నివాళి

- ఎక్స్ వేదికగా నివాళి అర్పించిన బాబు, లోకేశ్
- అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి అనిత నివాళి



**అమరావతి,జులై4 :** స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ నివాళులర్పించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. అల్లూరి త్యాగం, ధైర్యం, దేశభక్తి భారత జాతికి చిరస్మరణీయమని ముఖ్యమంత్రి కొనియాడారు. మన్యం వీరుడి పోరాట పటిమ, విప్లవ కార్యాచరణ అనితర సాధ్యమని మంత్రి లోకేశ్ అన్నారు. 'స్వాతంత్ర్య సమర చరిత్రలో అజరామరమైన అధ్యాయంగా నిలిచారు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం బ్రిటిష్ పాలనకు ఎదురొడ్డి అపూర్వ సాహసాన్ని ప్రదర్శించిన మహనీయుడు. ఆయన త్యాగం, ధైర్యం, దేశభక్తి యావత్ భారత జాతికి చిరస్మరణీయం. అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా ఆ మహావీరుడికి ఘన నివాళులు అర్పిస్తున్నాను' అని చంద్రబాబు పోస్ట్ చేశారు. 'మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి ఘన నివాళులు అర్పిస్తున్నాను. భారత స్వాతంత్య్ర ఉద్యమాన్ని విప్లవపథం వైపు నడిపిన పోరాటయోధుడు అల్లూరి సీతారామరాజు. దేశభక్తికి, త్యాగనిరతికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. ఆయన పోరాట పటిమ, విప్లవ కార్యాచరణ అనితర సాధ్యం. తెలుగుజాతికి, దేశానికి స్ఫూర్తిప్రదాతగా నిలిచిన అల్లూరి సీతారామరాజు సేవలను ఈ సందర్భంగా స్మరించుకుందాం' అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. స్వాతంత్య్ర సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద అల్లూరి విగ్రహానికి హోంమంత్రి అనిత పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. దేశ స్వాతంత్యం కోసం పోరాడిన యోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి మన్యం వీరుడు అని కొనియాడారు. అల్లూరి దేశభక్తి, ధైర్యం యువతరానికి ఆదర్శమని హోం మంత్రి అన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో అల్లూరి జయంత్యుత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. తెలుగు జాతి ఉన్నంతవరకూ ఆయన త్యాగం ప్రజల గుండెల్లో ఉంటుందన్నారు. అల్లూరి సీతారామరాజు ధైర్య సాహసాలకు ప్రతీక అని హోంమంత్రి అనిత కొనియాడారు.

## సీజనల్ వ్యాధులపై యుద్ధానికి 108 సన్నద్ధం

- వేగవంతమైన వైద్యసేవలతో ప్రజారోగ్యానికి అండగా 108
- ప్రతి అంబులెన్స్‌లో అత్యవసర మందులు, వైద్య పరికరాలు సిద్ధం




**అమరావతి, జూలై 4 :** వర్షాకాలం సీజనల్ వ్యాధులు పెరిగే అవకాశాల నేపథ్యంలో ప్రజలకు సకాలంలో అత్యవసర వైద్య సేవలు అందించేందుకు 108 అంబులెన్స్ సేవలు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా కాలానుగుణ వ్యాధులతో పాటు పాములు, తేళ్లు, ఇతర విష కీటకాల కాట్లు, విద్యుత్ ప్రమాదాలు, నీటిలో మునిగే ఘటనలు పెరిగే అవకాశం అవకాశం ఉంది. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాలు, వ్యవసాయ పొలాలు, ఏజెన్సీ ప్రాంతాలు, అడవులకు సమీప ప్రాంతాల్లో నివసించే ప్రజలకు అత్యవసర వైద్య సేవలు వేగంగా అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. వర్షాల కారణంగా రహదారులు దెబ్బతినడం, నీటిమునక ప్రాంతాలు ఏర్పడటం వంటి పరిస్థితుల్లోనూ బాధితులకు వీలైనంత త్వరగా వైద్య సహాయం అందించేందుకు 108 బృందాలు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నాయి. గోల్డెన్ అవర్‌లో స్పందనవర్షాకాల అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని 108 అంబులెన్స్‌లలో అవసరమైన అత్యవసర మందులు, ఆక్సిజన్, ప్రాథమిక ప్రాణరక్షక పరికరాలు, ఇతర వైద్య సామగ్రిని అందుబాటులో ఉంచారు. అత్యవసర పరిస్థితుల్లో సమయానికి స్పందించేలా ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు (ఇఓఐబ), పైలట్లకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు. గోల్డెన్ అవర్‌లో బాధితులకు ప్రాథమిక చికిత్స అందించి సమీప ఆసుపత్రికి సురక్షితంగా తరలించేందుకు అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చోట అదనపు సమన్వయంతో సేవలు అందిస్తున్నారు. ప్రాణాధారంగా 108గత ఏడాది కాలంలో 108 సేవలు వర్షాకాలంలో ఎక్కువగా కనిపించే అత్యవసర పరిస్థితుల్లో వేలాది మందికి ప్రాణాధారంగా నిలిచాయి. ఈ కాలంలో జ్వరానికి సంబంధించిన 28,933 అత్యవసర కేసులు, జంతువులు/విష కీటకాల కాట్లకు సంబంధించిన 14,353 కేసులు, విద్యుత్ షాక్‌కు సంబంధించిన 2,194 కేసులు, నీటిలో మునిగిన 718 కేసులు, పిడుగుపాటుకు సంబంధించిన 96 కేసులకు సకాలంలో స్పందించి అత్యవసర వైద్య సేవలు అందించాయి. ఈ గణాంకాలు వర్షాకాలంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో సమయానికి అందే వైద్య సహాయమే ప్రాణాలను కాపాడగలదని ఈ ఘటనలు మరోసారి నిరూపించాయి.వర్షాకాలంలో ముఖ్యంగా పాములు, తేళ్లు, ఇతర విష కీటకాలు నివాస ప్రాంతాల్లోకి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అలాగే భారీ వర్షాల సమయంలో నీటిలో మునిగే ప్రమాదాలు, విద్యుత్ తీగలు తెగిపడటం వల్ల విద్యుత్ షాక్ ఘటనలు, వైరల్ జ్వరాలు వంటి అత్యవసర పరిస్థితులు కూడా పెరుగుతుంటాయి. ఇలాంటి సందర్భాల్లో ప్రజలు భయాందోళనలకు గురికాకుండా వెంటనే 108 సేవలను ఆశ్రయించాలని అధికారులు సూచిస్తున్నారు. స్థానిక చికిత్సలపై ఆధారపడకుండా వైద్య నిపుణుల సహాయం పొందడం వల్ల ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశాలు మెరుగవుతాయి.

## మావిగన్ పేలని రాజకీయ గన్

- అయోమయ ప్రకటనలతో రాజకీయ పబ్బం
- జగన్ తీరుపై మండిపడ్డ లంకా దినకర్

**అమరావతి, జులై 4 :** 'మావిగన్' తూటా లేని గన్ అని.. అది పేలదంటూ ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ సెటైర్ విసిరారు. 'నిన్న మూడు రాజధానులు మా నినాదం అన్నారు.. ఈరోజు మావిగన్ మా నినాదం అన్నారు.. రేపు ఏమిటో అర్థం కానీ అయోమయం జగన్నాథం మా నినాదం అనే విధంగా జగన్ తీరు ఉంది' అంటూ వ్యాఖ్యానించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై లంకా దినకర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాజధానిపై జగన్‌కు కనీస అవగాహన లేదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పం వికసిత్ భారత్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయం స్వర్ణ ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. జగన్ సంకల్పం, ధ్యేయం మాత్రం వినాశక ఏపీ అంటూ మండిపడ్డారు. డబుల్ ఇంజన్ సర్కార్ నేతృత్వంలో రాష్ట్రం సమగ్ర సమ్మిళిత అభివృద్ధి లక్ష్యంగా దూసుకుపోతోందని లంకా దినకర్ అన్నారు. హార్టికల్చర్ హబ్‌గా 1 లక్ష కోట్ల పెట్టుబడితో రాయలసీమ, మార్కాపురం జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ఆంధప్రదేశ్ జీవనాడిగా, పోలవరం- నల్లమల్ల సాగర్ బొల్లాపల్లి ద్వార అనుసంధానం చేసి వెలిగొండ ప్రాజెక్ట్ ద్వారా మార్కాపురం, కడప, నెల్లూరు జిల్లాలకు శాశ్వతంగా కరువుకు పరిష్కారం చూపుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి డబుల్ ఇంజిన్ సర్కార్ కృషి చేస్తోందన్నారు. జగన్ ఈ అభివృద్ధి నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి 'మావిగన్' అని విషం కక్కుతున్నారని మండిపడ్డారు. మిగిలిన ప్రాంత ప్రజలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే ప్రయత్నాలు చేస్తున్నారంటూ లంకా దినకర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.



## రాష్ట్ర మంత్రి నారాయణ ఏలూరు పర్యటన


**మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేసిన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి**

**ఏలూరు, జులై 04 :** జిల్లాకు ఒక్కరోజు పర్యటనకు శనివారం వచ్చిన రాష్ట్ర మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణను మర్యాద పూర్వకంగా కలిసి జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి పూలమొక్కను అందజేశారు. జిల్లా కలెక్టరుతో పాటు ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), ఏలూరు నగర మేయరు షేక్ నూర్జహాన్, జిల్లా జాయింటు కలెక్టరు యం. జె.అభిషేక్ గౌడ లు పుష్పగుచ్ఛాలు, పూలమొక్కలను అందించి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.లక్ష్మి ప్రసన్న, నగర పాలక సంస్థ కమిషనరు ఏ.భాను ప్రతాప్, ఏలూరు ఉడా చైర్మన్ పెద్దిబోయిన వాణిశివప్రసాదు, ఏయంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, కో-ఆప్షన్ సభ్యులు యస్.యం.ఆర్. పెదబాబు, చోడే వెంకటరత్నం, వివిధ కార్పొరేటర్లు, మెప్మా పిడి యం.రాజబాబు, నగర పాలక సంస్థ ఇంజనీరింగు అధికారులు, తహశీల్దారు కె.గాయత్రీదేవి, జీవనోపాధి జిల్లా కో-ఆర్డినేటరు సి.హెచ్.మహాలక్ష్మి, నాగసాయి స్వయం సహాయక సంఘం సభ్యురాలు కొనే క్రాంతి, తదితరులు మంత్రికి ఘనస్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

# టాప్‌లోకి టాటా మోటార్స్..

ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీ టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్‌లో తన సత్తా చాటింది. దేశవ్యాప్తంగా జూన్‌లో అత్యధికంగా అమ్ముడైన కార్ల జాబితాలో మొదటి, రెండు స్థానాలను దక్కించుకుంది. టాప్ -10లో వరుసగా టాటా పంచ్, నెక్సాన్ ముందు వరుసలో నిలిచాయి. ఆ తర్వాత మారుతీ సుజుకీకి చెందిన ఆరు మోడళు టాప్‌లో ఉన్నాయి. దీంతో అత్యధిక మోడళ్లు విక్రయించిన కంపెనీగా మారుతీ సుజుకీ నిలిచింది. హ్యుందాయ్‌కి చెందిన క్రెటా ఈ జాబితాలో చోటు సాధించకపోవడం గమనార్హం. టాటా కంపెనీ దేశీయంగా మొత్తం 63,083 యూనిట్లను విక్రయించింది. దీంతో గతేడాది ఇదేకాలంతో పోలిస్తే 69% వృద్ధిని నమోదు చేయడం విశేషం. ఇందులో రికార్డు స్థాయిలో 14,800 విద్యుత్ కార్లు ఉన్నాయి. 21,006 యూనిట్ల విక్రయాలతో టాటా పంచ్ తొలి స్థానాన్ని ఆక్రమించింది. మూడో స్థానంలో నిలిచిన మారుతీ సుజుకీ డిజైర్.. దేశంలోనే అత్యధికంగా అమ్ముడవుతున్న సెడాన్ కారుగా నిలిచింది.






# పైరసీపై చర్యలు..

## టెలిగ్రామ్‌కు కేంద్రం నోటీసులు

ఆన్‌లైన్ మెసేజింగ్ యాప్‌లలో భద్రతపై దృష్టి సారించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా టెలిగ్రామ్‌కు నోటీసులు జారీ చేసింది. కాపీరైట్ ఉల్లంఘనకు పాల్పడుతోన్న ఛానళ్లు, కంటెంట్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ టెలిగ్రామ్‌ను ఆదేశించింది. ఎటువంటి చర్యలు తీసుకున్నారనే దానిపై 15 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని అల్టిమేటం ఇచ్చింది. వీలైనంత త్వరగా పైరసీ కంటెంట్‌ను తొలగించాలని ఆదేశించింది. కాపీరైట్ ఉల్లంఘన అనేది కేవలం సివిల్ కేసు మాత్రమే కాదని.. ఇది క్రిమినల్ నేరం కూడా అవుతుందని కేంద్రం ఈ సందర్భంగా పేర్కొంది. టెలిగ్రామ్ వేదికగా పైరసీ సినిమాలు, ఓటీటీ కంటెంట్ ఎక్కువగా షేర్ అవుతున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకుంది. ప్రొడ్యూసర్లు, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, దర్యాప్తు సంస్థల కోసం ఎలాంటి గ్రీవెన్స్ వ్యవస్థను ఏర్పాటు చేశారో తెలియజేయాలని టెలిగ్రామ్‌ను కేంద్రం ఆదేశించింది. ఇటీవల నీట్ పరీక్ష ప్రశ్నపత్రాలు టెలిగ్రామ్‌లో లీక్ అయినట్లు ఆరోపణలు రావడంతో.. కేంద్రం కొన్ని రోజుల పాటు ఈ మెసేజింగ్ యాప్‌ను దేశంలో బ్లాక్ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా దీనికి నోటీసులు జారీ చేయడం గమనార్హం. మరోవైపు చిన్నారులపై లైంగిక వేధింపులను ప్రోత్సహించేలా ఉన్న ప్రకటనలు, సైబర్‌మోసాల ముప్పు దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఇన్‌స్టాగ్రామ్, మెటాకు నోటీసులు జారీ చేసింది. వివాదాస్పద ప్రకటనలపై వివరణ ఇవ్వాలని మెటాను ఆదేశించింది.





# బెతెల్ మెరుపులు..

## ఇంగ్లాండ్ విజయం

**మాంచెస్టర్:** ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా భారత్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా 7 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది. ఈ టార్గెట్‌ని ఇంగ్లాండ్ ఆరు బంతులు మిగిలుండగానే 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. లక్ష్యఛేదనలో ఇంగ్లాండ్‌కు శుభారంభం లభించలేదు. అర్ష్‌దీప్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే ఓపెనర్లు ఫిల్ సాల్ట్, బట్లర్ డకౌటయ్యారు. ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన జాకబ్ బెతెల్ (76; 46 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. హ్యారీ బ్రూక్ (39; 15 బంతుల్లో 4 ఫోర్లు ,3 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు మెరుపులు మెరిపించాడు. టామ్ బాంటన్ (39; 32 బంతుల్లో) రాణించాడు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ మూడు వికెట్లు, హర్షిత్ రాణా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి తలో వికెట్ తీశారు. మూడో టీ20 జులై 7న నాటింగ్‌హామ్‌లో జరగనుంది. భారత బ్యాటర్లలో ఇషాన్ కిషన్ (49; 40 బంతుల్లో 6 ఫోర్లు) టాప్ స్కోరర్. అభిషేక్ శర్మ (43; 24 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడాడు. శ్రేయస్ అయ్యర్ (37), తిలక్ వర్మ (24) రాణించారు. ఈ మ్యాచ్‌తో అరంగేట్రం చేసిన యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (14) పరుగులు చేశాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో సామ్ కరన్ మూడు వికెట్లు, జోఫ్రా ఆర్చర్, విల్ జాక్స్, లియామ్ డాసన్‌లు తలో వికెట్ తీశారు. తొలి టీ20 మ్యాచ్ వర్షార్పణమైన విషయం తెలిసిందే.







# క్లెయిమ్‌ల పరిష్కారం ఆలస్యం

## రెండువారాల పాటు సమస్యలు : ఈపీఎఫ్‌వో

పీఎఫ్ పాక్షిక ఉపసంహరణ వంటి క్లెయిమ్‌ల పరిష్కారం ఆలస్యం కానుంది. సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్‌లో భాగంగా సేవలకు సాధారణం కన్నా ఎక్కువ సమయం పట్టే అవకాశాలున్నట్లు ఈపీఎఫ్‌వో వెల్లడించింది. నూతన సాఫ్ట్‌వేర్ సాధారణ స్థితికి చేరుకునే వరకు... కనీసం రెండు వారాల పాటు క్లెయిమ్‌ల పరిష్కారం నిర్ణీత గడువు కన్నా ఆలస్యమవుతుందని వివరించింది. ఈ మేరకు చందాదారులు సహకరించాలని కోరింది. సాఫ్ట్‌వేర్ ఉన్నతీకరణ, మెరుగైన ఆటోమేషన్, కనీస నిల్వ, ఇతర ప్రయోజనాల కోసం జూన్ 26 నుంచి ఈపీఎఫ్‌వో సర్వర్లను నిలిపివేసింది. జులై 1 నుంచి కొత్త పోర్టల్‌లు అందుబాటులోకి వస్తాయని ప్రకటించినా, సాంకేతిక కారణాలతో ఆలస్యమైంది. శుక్రవారం నుంచి ఈపీఎఫ్, ఈపీఎస్-2026 పథకాలకు అనుగుణంగా ఆధునికీకరించిన మెంబర్, ఎంప్లాయర్ పోర్టల్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. పాస్‌బుక్ సేవల సాఫ్ట్‌వేర్ ఉన్నతీకరణ ఇంకా కొనసాగుతోందని, తాత్కాలికంగా అంతరాయం ఉంటుందని ఈపీఎఫ్‌వో తెలిపింది. రద్దీ సమయాల్లో తరచూ వెబ్‌సైట్ ఓపెన్ చేయవద్దని ఖాతాదారులను కోరింది.

### మెంబర్ పోర్టల్‌లో వచ్చిన ముఖ్య మార్పులివీ...

- మెంబర్ పోర్టల్‌లో కొత్తగా సర్వీసు హిస్టరీ వచ్చింది. అంటే ఇప్పటివరకు ఎన్ని సంస్థల్లో పనిచేశారో తెలుసుకోవచ్చు. ఏ సంస్థలో సభ్యత్వం కొనసాగుతుందో తెలుసుకోవచ్చు.
- పూర్తి, పాక్షిక ఉపసంహరణ, పింఛను క్లెయిమ్‌ల స్థితిని ట్రాక్ చేయవచ్చు.
- గతంలో పనిచేసిన సంస్థల నుంచి పొందిన స్కీమ్ సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్లోనే సరెండర్ చేయవచ్చు.
- పాత సాఫ్ట్‌వేర్, కొత్త సాఫ్ట్‌వేర్‌తో కూడిన పోర్టల్‌లో నమోదైన క్లెయిమ్‌లను ట్రాక్ చేసుకోవచ్చు.
- క్లెయిమ్‌కు దరఖాస్తు చేశాక... వద్దనుకుంటే వెంటనే నిలిపివేయవచ్చు.
- సభ్యుల యూఏఎన్ కార్డు పొందుపరిచింది. గతంలో ఫొటో లేదు.. ఇప్పుడు సభ్యుడి ఫొటోతో కార్డును పొందవచ్చు.



# మూడో రోజు ముగిసిన ఆట..

## ఇండియా ఎ 541/8

గాలె: శ్రీలంక-ఎ, ఇండియా ఎ మధ్య జరుగుతున్న రెండో అనధికార టెస్టులో మూడో రోజు ఆట ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో 247/1తో శనివారం ఆటను కొనసాగించిన భారత జట్టు ఆట ముగిసే సమయానికి 8 వికెట్ల నష్టానికి 541 పరుగులు చేసింది. దేవ్‌దత్ పడిక్కల్ (94; 152 బంతుల్లో 11ఐ4) సెంచరీ మిస్ చేసుకున్నాడు. పడిక్కల్ శుక్రవారం తాను ఎదుర్కొన్న తొలి బంతికే వెనుదిరిగాడు. 104 పరుగుల వ్యక్తిగత స్కోరుతో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఓపెనర్ సాయి సుదర్శన్ (168; 267 బంతుల్లో 22 ఫోర్లు) భారత్ ఆధిక్యంలోకి వెళ్లిన కాసేపటికే పెవిలియన్ చేరాడు. రుతురాజ్ గైక్వాడ్ (13) రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. ధ్రువ్ జురెల్ (53; 88 బంతుల్లో), సారాంశ్ జైన్ (68; 137 బంతుల్లో) అర్ధ శతకాలు సాధించారు. షేక్ రషీద్ (45; 51 బంతుల్లో), ఆకిబ్ నబీ దార్ (30) రాణించారు. సారాంశ్ జైన్‌తోపాటు యశ్ ఠాకూర్ (2) క్రీజులో ఉన్నాడు.

# రంగారెడ్డి రైజర్స్‌పై ఖమ్మం విజయం



హైదరాబాద్: టీజీ20 లీగ్ 2026లో అన్విత ఖమ్మం ఏసెస్ నాలుగో విజయం ఖాతాలో వేసుకుంది. శనివారం రంగారెడ్డి రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఖమ్మం జట్టు 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన రంగారెడ్డి రైజర్స్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 147 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని ఖమ్మం 17.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఖమ్మం టీమ్ బ్యాటర్లలో హిమతేజ కొడిమెల (45; 28 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), మికిల్ జైస్వాల్ (30; 22 బంతుల్లో 3 ఫోర్లు), సీవీ మిలింద్ (29లి; 21 బంతుల్లో 4 ఫోర్లు) రాణించారు. ప్రతీక్ రెడ్డి (17), జీఎస్‌కే రెడ్డి (14) పరుగులు చేశారు. ఛేదనలో 9.2 ఓవర్ల తర్వాత ఆటకు కాసేపు వరుణుడు ఆటంకం కలిగించాడు. తర్వాత తిరిగి మ్యాచ్ ప్రారంభమైంది. ఇప్పటివరకు ఆరు మ్యాచ్‌లు ఆడిన రంగారెడ్డి రైజర్స్‌కు ఇది మూడో ఓటమి. టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ చేసిన రంగారెడ్డి బ్యాటర్లలో ఆదిత్య జవ్వాజి (43) టాప్ స్కోరర్. జ్ఞాన ప్రకాశ్ రెడ్డి (36), నితిన్ సాయి యాదవ్ (19), అరవెల్లి అవనీశ్ (12), తనయ్ త్యాగరాజన్ (14) పరుగులు చేశారు. ఖమ్మం బౌలర్లలో చామా మిలింద్ 3, హర్షిత్ సాయి 2, వేద్ రెడ్డి 2.. విద్యానంద రెడ్డి, షేక్ అజహర్ చెరో వికెట్ తీశారు.




# ఇక డీజిల్ వంతు..

## 15% ఐసోబ్యుటనాల్ కలపడంపై కేంద్రం దృష్టి

చమురు దిగుమతుల భారాన్ని తగ్గించేందుకు కేంద్రం మరో ప్రయత్నం చేస్తోంది. డీజిల్‌లో 15 శాతం ఐసోబ్యుటనాల్ కలపడంపై దృష్టి సారించింది. దేశంలో ఇంధన భద్రతను మెరుగుపరిచేందుకు, రవాణా రంగంలో కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ఇది దోహదపడుతుందని కేంద్రం భావిస్తోంది. ఈ మేరకు ప్రత్యామ్నాయ ఇంధన వ్యూహంపై కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యానించారు. “డీజిల్‌తో ఇథనాల్‌ను నేరుగా కలపడం సాధ్యం కాదు. అందుకే ఇథనాల్ నుంచి ఐసోబ్యుటనాల్ తయారీకి కృషి చేస్తున్నాం. ఇది డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా మారుతుంది. డీజిల్‌లో 15 శాతం ఐసోబ్యుటనాల్ కలపడంపై ప్రభుత్వం పనిచేస్తోంది. ఇంధనం స్వయం సమృద్ధికి ఇది కీలక అడుగుగా మారనుంది” అని ఆయన అన్నారు. ఇందుకు సంబంధించిన పైలట్ ప్రాజెక్టు కూడా ప్రోత్సాహకర ఫలితాలు ఇచ్చిందన్నారు. 100 శాతం ఇథనాల్, ఐసోబ్యుటనాల్‌తో నడిచే రెండు రకాల ఇంధనాలను తయారు చేశామని, ఇందుకు ఇంజిన్‌లు కూడా సపోర్టు చేస్తాయన్నారు. కాగా, భవిష్యత్తు జీవ ఇంధనంగా ఐసోబ్యుటనాల్ మారనుందని సంబంధిత అధికారులు ఆశిస్తున్నారు. ఇతర బయో ఫ్యూయెల్స్ కంటే తక్కువ కర్బన ఉద్గారాలు వెలువడటం, ఇంజిన్ నాణ్యత మెరుగవ్వడమే ఇందుకు కారణం. దీంతో దేశీయంగా జీవ ఇంధనాల డిమాండ్ పెరగడంతో ముడి చమురు దిగుమతులను తగ్గించుకోవచ్చు. విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది. పంట వ్యర్థాల నుంచి ఐసోబ్యుటనాల్‌ను ఉత్పత్తి చేయొచ్చు కాబట్టి.. రైతులూ అదనపు ఆదాయాన్ని ఆర్జిస్తారు.



# 'జాంబిరెడ్డి 2'లో శనయా కపూర్

'హను-మాన్', 'మిరాయ్' చిత్ర విజయాలతో జోరుమీదున్నారు యువ హీరో తేజ సజ్జా. ప్రస్తుతం ఆయన 'జాంబిరెడ్డి 2' కోసం రంగంలోకి దిగిన సంగతి తెలిసిందే. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమాని సుపర్ణ్ వర్మ తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికర విషయం బయటకొచ్చింది. ఇందులో తేజకు జోడీగా బాలీవుడ్ భామ శనయా కపూర్ నటిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆమె ఈ చిత్ర సెట్‌లోకి అడుగు పెట్టిందని.. ప్రస్తుతం తేజ - శనయాలపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారని తెలిసింది. ఈ సినిమాకి దర్శకుడు ప్రశాంత్ వర్మ కథ అందిస్తుండగా.. ఎస్‌జే సూర్య ముఖ్య పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. తేజ ప్రస్తుతం పీపుల్ మీడియా సంస్థలోనే 'మిరాయ్ 2' సినిమాని చేస్తున్నారు. ఈ రెండు చిత్రాలు వచ్చే ఏడాది తెరపైకి వచ్చే అవకాశముంది.

# నెట్‌ఫ్లిక్స్‌లో పెద్ది



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన 'పెద్ది' మూవీ ఓటిటి రిలీజ్ డేట్ కన్ఫామ్ అయ్యింది. థియేటర్లలో సూపర్ హిట్‌గా నిలిచిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. 'ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ తేదీని అధికారికంగా ప్రకటించింది. జూలై 9 నుంచి ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి రానుంది. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో కూడా ఒకేసారి విడుదల చేయనున్నట్లు నెట్‌ఫ్లిక్స్ వెల్లడించింది. దీంతో థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు ఇంట్లోనే ఈ చిత్రాన్ని ఆస్వాదించే అవకాశం దక్కనుంది. విడుదలైన తొలి రోజు నుంచే 'పెద్ది'కి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామీణ నేపథ్యంలో స్పోర్ట్స్, ఎమోషన్, ఫ్యామిలీ డ్రామా అంశాలను సమతుల్యంగా మిళితం చేసిన బుచ్చిబాబు కథనం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా రామ్ చరణ్ నటన, పాత్రలోని తీవ్రత, భావోద్వేగ సన్నివేశాలు సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా రూ.400 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించి ఈ చిత్రం రామ్ చరణ్ కెరీర్‌లో మరో భారీ విజయంగా నిలిచింది.

# శరవేగంగా స్పిరిట్ షూటింగ్




రెబల్ స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్పిరిట్' షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జెట్ స్పీడ్‌లో సాగుతుండగా.. చిత్ర బృందం ఎలాంటి విరామం లేకుండా వరు స షెడ్యూళ్లతో దూసుకెళుతోంది. స్పిరిట్ షూటింగ్‌లో ఇప్పటికే దాదాపు 70 శాతం పూర్తయినట్లు, కేవలం 30 శాతం చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా కోసం ప్రభాస్ కూడా పూర్తిస్థాయిలో సమయం కేటాయిస్తూ.. ప్రతి యాక్షన్ సన్నివేశాన్ని డూప్ లేకుండా స్వయంగా చేస్తున్నారని సమాచారం. యాక్షన్ సీక్వెన్స్‌లలో ప్రభాస్ అంకితభావం చిత్ర యూనిట్‌ను కూడా ఆకట్టుకుంటోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక దర్శకుడు సందీప్ రెడ్డి వంగా పనితీరు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రీ-ప్రొడక్షన్ దశలోనే ప్రతి సన్నివేశా న్ని, షూటింగ్ షెడ్యూల్‌ను పక్కాగా సిద్ధం చేసుకునే ఆయన.. సెట్స్‌పైకి వెళ్లిన తర్వాత మాత్రం శరవేగంగా చిత్రీకరణ పూర్తి చేసే దర్శకుడిగా పేరొందాడు. 'స్పిరిట్' విషయంలోనూ అదే వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముం దస్తు ప్రణాళిక కారణంగానే షూటింగ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా కొనసాగుతోందని సమాచారం.



# రాజమౌళికి అరుదైన గౌరవం

## వాల్ ఆఫ్ ఫిల్మ్ మేకర్స్'లో చోటు

తెలుగు సినిమా గ్లోబల్ స్థాయికి వెళ్ళిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళికి ఫ్రాన్స్ లో మరొక అరుదైన గౌరవం దక్కింది. ఫ్రాన్స్ లోని లూమియర్ ఇన్స్టిట్యూట్, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళిని ప్రత్యేకంగా సత్కరించింది. అక్కడి 'వాల్ ఆఫ్ ఫిల్మ్ మేకర్స్' పై ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ దర్శకుల పేర్లు ఉన్నాయి. ఇప్పుడు రాజమౌళి పేరు కూడా ఆ జాబితాలో చేరింది. ఈ ప్రోగ్రామ్ లో రాజమౌళి తెరకెక్కించిన 'ఈగ', 'ఆర్ఆర్ఆర్' సినిమాలను ప్రదర్శించారు. 2012 లో విడుదలైన 'ఈగ', చిన్న కాన్సెప్ట్ ను కొత్తగా చూపించిన సినిమాగా గుర్తింపు పొందింది. ఇక 'ఆర్ఆర్ఆర్' ప్రపంచవ్యాప్తంగా విడుదలై పలు అంతర్జాతీయ అవార్డులు అందుకోవడంతో పాటు, భారతీయ సినిమాపై విదేశీ ప్రేక్షకుల దృష్టిని మరింత ఆకర్షించింది. ఇటీవలే పారిస్ లోని 'సినీమాథెక్ ఫ్రాంకైస్' థియేటర్ లో రాజమౌళి పేరుతో శాశ్వత సీటును కేటాయించగా, ఇప్పుడు లూమియర్ ఇన్స్టిట్యూట్ జక్కన్న చిత్రాలతో ప్రత్యేక రెట్రోస్పెక్టివ్ ను నిర్వహిస్తుంది. 'బాహుబలి', 'ఈగ', 'ఆర్ఆర్ఆర్' లాంటి చిత్రాలను ప్రదర్శిస్తూ, భారతీయ సినిమాలపై అంతర్జాతీయ ప్రేక్షకుల్లో ఆసక్తి ఎలా పెరుగుతోందో ఈ కార్యక్రమం మరోసారి చూపిస్తుంది.




# ప్యారడైజ్ మూవీపై నాని ఫోకస్

## కొత్త చిత్రాలకు డేట్లు కుదరక నో

నేచురల్ స్టార్ నాని హీరోగా, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ది ప్యారడైజ్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఎస్-ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో నాని 'జడల్' అనే పూర్తి స్థాయి మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఆయనకు జోడీగా కయాదు లోహర్ 'సుబ్బలక్ష్మి' పాత్రలో నటిస్తోంది. విలక్షణ నటుడు మోహన్ బాబు ప్రధాన ప్రతినాయకుడిగా కనిపించనుండగా, సోనాలి కులకర్ణి, రాఘవ్ జుయల్, సంపూర్ణేశ్ బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, జీకే విష్ణు సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మొదట ఈ సినిమాను ఆగస్టు 21న విడుదల చేయాలని భావించినప్పటికీ, నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో విడుదల తేదీ సెప్టెంబర్ 25కు మారే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ది ప్యారడైజ్'పై పూర్తి దృష్టి పెట్టిన నాని, ఇతర సినిమాలను తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. షూటింగ్ ఆలస్యం కావడం వల్ల ఆయన రెండు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను వదులుకోవాల్సి వచ్చినట్లు సమాచారం. మొదటిది, 'హాయ్ నాన్న' దర్శకుడు శౌర్యువ్ సిద్ధం చేసిన కొత్త సినిమా. కథ నచ్చినా డేట్స్ అందుబాటులో లేకపోవడంతో, ఆ ప్రాజెక్ట్‌ను వేరే హీరోతో ముందుకు తీసుకెళ్లాలని నాని సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ కథ విజయ్ దేవరకొండ వద్దకు వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక రెండోది, 'జై భీమ్' దర్శకుడు టీజే జ్ఞానవేల్ రూపొందించాలనుకున్న చిత్రం. కథపై నానికి మంచి అభిప్రాయం ఉన్నప్పటికీ, డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఈ కాంబినేషన్ కార్యరూపం దాల్చలేదని తెలుస్తోంది. ప్రస్తుతం జ్ఞానవేల్ హీరో సూర్యతో తన తదుపరి చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'ది ప్యారడైజ్' పూర్తయిన తర్వాత దర్శకుడు సుజీత్‌తో కలిసి 'బ్లడీ రోమియో' అనే సినిమా చేయాలని నాని భావిస్తున్నట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. అయితే సుజీత్ ప్రస్తుతం పవన్ కళ్యాణ్‌తో 'ఓజీ-2' ప్రాజెక్ట్‌పైనా దృష్టి పెట్టడంతో, నాని-సుజీత్ సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుందన్నది ఆసక్తికరంగా మారింది. నిర్మాతపై అదనపు ఆర్థిక భారం ప డకుండా ఉండాలనే ఉద్దేశంతో నాని తన తదుపరి కమిట్‌మెంట్లను వాయిదా వేసి, 'ది ప్యారడైజ్'ను పూర్తి చేయడంపైనే పూర్తి దృష్టి సారించినట్లు సమాచారం.




# 10న లెనిన్ విడుదల

నేడు తిరుపతిలో ప్రీ రిలీజ్ ఈవెంట్

అక్కినేని అఖిల్ హీరోగా, అందాల తార భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించిన చిత్రం 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూలై 10న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. అఖిల్ కెరీర్‌లో ఎంతో కీలకంగా భావిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలలో మరింత వేగవంతం చేసింది. ఇప్పటికే విడుదలైన 'లెనిన్' ట్రైలర్ కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా యాక్షన్, ఎమోషన్స్, నాగార్జున వాయిస్ ఓవర్‌తో రూపొందిన ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచింది. తాజాగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ తేదీ, వేదికను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. జూలై 5న తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్స్‌లో లెనిన్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను చిత్ర యూనిట్ ఘనంగా నిర్వహించనుంది. ఈ ఈవెంట్‌కు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలుస్తోంది.



# నా లైఫ్ పార్ట్‌నర్ సెన్సిబుల్‌గా ఉండాలి

## నటి శ్రీలీల మనోగతం

టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ అండ్ ఎనర్జిటిక్ బ్యూటీ శ్రీలీల పెళ్లి, రిలేషన్‌షిప్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న బ్యూటీ.. తనకు కాబోయే వాడు ఎలా ఉండాలి? తన లైఫ్ పార్ట్‌నర్‌లో ఎలాంటి క్వాలిటీస్ వెతుకుతుంది? అనే విషయాలపై తాజాగా క్లారిటీ ఇచ్చింది. ఒక ఇంటర్వ్యూలో శ్రీలీలను రిలేషన్‌షిప్ గురించి అడగగా, తన మనసులోని మాటను పంచుకుంది. తనకు కాబోయే వాడు ముఖ్యంగా మూడు లక్షణాలు కలిగి ఉండాలని స్పష్టం చేసింది. 'నాకు లైఫ్ పార్ట్‌నర్‌గా వచ్చే వ్యక్తి చాలా సెన్సిబుల్‌గా ఉండాలి. అలాగే ఇతరుల భావాలను గౌరవించే సెన్సిటివ్ మనస్తత్వం ఉండాలి. వీటన్నింటితో పాటు మోస్ట్ ఇంపా÷-టర్గ÷ంట్ క్వాలిటీ.. అతనికి మంచి సెన్స్ ఆఫ్ హ్యూమర్ కచ్చితంగా ఉండాలి' అని శ్రీలీల పేర్కొంది. కేవలం లుక్స్ మాత్రమే కాకుండా, వ్యక్తిత్వానికి, ఎదుటివారిని అర్థం చేసుకునే గుణానికే తాను మొదటి ప్రాధాన్యత ఇస్తానని ఈ బ్యూటీ హింట్ ఇచ్చేసింది. ప్రస్తుతం శ్రీలీల చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గ్లామర్, యాక్టింగ్, అదిరిపోయే డాన్స్‌లతో కుర్రకారు మనసు దోచుకున్న ఈ ముద్దుగుమ్మ.. రిలేషన్‌షిప్ విషయంలో ఇంత క్లారిటీగా ఉండటంపై ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. శ్రీలీల చెప్పిన క్వాలిటీస్ విన్నాక.. 'బాస్.. ఆ క్వాలిటీస్ మనలో ఉన్నాయో లేదో ఒకసారి చెక్ చేసుకోవాల్సిందే' అంటూ నెటిజన్లు, అబ్బాయిలు సోషల్ మీడియాలో సరదా కామెంట్స్ పెడుతున్నారు.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com